RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:200 శుక్రవారం 21 ఆగస్టు 2026 పేజీలు :8 వెల రూ.5
Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.
PRESS
77309 83966 98491 98098

## ప్రతీ ఫిర్యాదుకు పరిష్కారం తప్పనిసరి

- కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షణ
- అధికారులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 20 :**
ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా 22ఎ అంశంపై రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని, మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో 22-ఎ సెక్షన్ దుర్వినియోగం



- రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 20:**
తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగం జరుగుతోందని బీఆర్ఎస్ నేత, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు ఆరోపించారు. ఈమేరకు మిగతా 2వ పేజీలో..

## 22-ఎ పేరిట భూ దోపిడీ

- రాష్ట్రంలో నడుస్తున్నది దోపిడీ పాలన
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



**హైదరాబాద్, ఆగస్టు 20 :**
ప్రజల ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ శాఖ బ్రోకర్‌లా వ్యవహరిస్తూ ప్రజల భూములను లూటీ చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మిగతా 2వ పేజీలో..



# 22ఏ కొలిక్కి వచ్చేనా?

## పాత జాబితాతో భూ వివాదాలకు ముగింపు పలికే యోచనలో సర్కారు

- 2025 కొత్త జాబితాపై వెల్లువెత్తిన అభ్యంతరాలు
- 2023 నాటి జాబితాకే పరిమితం చేసే కసరత్తు
- పక్కా ఆధారాలున్న భూములకు ఫాస్ట్‌ట్రాక్ క్లియరెన్స్
- 22ఏ సమస్యపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- ప్రభుత్వంపై విపక్షాల ఆరోపణలతో రాజకీయ వేడి

**హైదరాబాద్, ఆగస్టు 20:**
తెలంగాణలో తీవ్ర వివాదానికి కారణమైన 22ఏ నిషేధిత భూముల సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. 2025 డిసెంబర్‌లో రూపొందించిన కొత్త నిషేధిత జాబితాలో ప్రైవేటు భూములు చేరడంతో తలెత్తిన సమస్యలను సరిదిద్దేందుకు పాత జాబితాను ప్రాతిపదికగా తీసుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. మరోవైపు పక్కా ఆధారాలున్న భూములకు తక్షణమే రిజిస్ట్రేషన్లు జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ విధానాన్ని అమలు చేస్తోంది. 22ఏ జాబితాలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు ఉన్నతస్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**కొత్త జాబితాతో మొదలైన చిక్కులు**
ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, సీలింగ్, కోర్టు వివాదాలకు సంబంధించిన భూములను రక్షించేందుకు 22ఏ నిషేధిత జాబితాను రూపొందించారు. అయితే 2025 డిసెంబర్‌లో రూపొందించిన కొత్త జాబితాలో దశాబ్దాలుగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న భూములు, ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్లు కూడా మిగతా 2వ పేజీలో..

## విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం

- ఏపీ సీఎం చంద్రబాబు
- హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం
- హాజరైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు

2




## రాజీవ్ గాంధీ ఆశయాలతో బలమైన భారత్

- సద్భావనతో సమైక్యతే మన శక్తి: సీఎం రేవంత్‌రెడ్డి
- రాజీవ్ గాంధీకి ముఖ్యమంత్రి ఘన నివాళి
- సద్భావనా దినోత్సవం ప్రజలకు స్ఫూర్తిదాయకమన్న సీఎం
- శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రాధాన్యం
- సమానత్వంతో దేశ నిర్మాణానికి పిలుపు
- రాజీవ్ ఆశయాలను కొనసాగించాలని సూచన

3

### రాజీవ్ దార్శనికతతోనే ఆధునిక భారత నిర్మాణం

- శ్రీపెరంబుదూరులో రాజీవ్ డిప్యూటీసీఎం భట్టి నివాళి



3



### కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై హైకోర్టు ఆగ్రహం

- ఉచిత పథకాలకు చట్టబద్ధ ఆధారం ఏంటని ప్రశ్న
- స్టే ఎత్తివేతకు హైకోర్టు నిరాకరణ
- ప్రభుత్వ జీవోలతో ప్రజాధనం ఖర్చు చేయడంపై ప్రశ్న
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ధర్మాసనం ఆందోళన
- ఆర్టీసీ వంటి సంస్థలను లాభాల్లోకి తేవాలని సూచన
- భూ బాధితులకు పరిహారంపై ప్రభుత్వాన్ని నిలదీత

2



### 30శాతం కమీషన్ల వసూళ్లపై జవాబివ్వాలి

2



### అర్ధరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

3



## సమన్వయం, డిజిటల్ వేదికలతో సత్వర న్యాయం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్
- రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ, పోలీసు శాఖ సంయుక్త సదస్సు

**హైదరాబాద్, ఆగస్టు 20 :**
కొత్త నేర చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం (బీఎస్ఏ) అమలులో డిజిటల్ వేదికల వినియోగం, వివిధ విభాగాల మధ్య సమన్వయం కీలకమని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. న్యాయవ్యవస్థ, పోలీస్, జైళ్లు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, వైద్య విభాగాలతో పాటు ఎన్ఐసీ, ఎన్‌సీఆర్‌బీ వంటి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ పోలీస్ శాఖ మిగతా 3వ పేజీలో..

## ఆమె వ్యక్తిగతం.. నాకు సంబంధం లేదు

- కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు: మంత్రి
- మల్లు రవికి సురేఖ లేఖ
- కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలేనని స్పష్టం
- కుటుంబ బంధాలతో రాజకీయ బాధ్యత మోపడం సరికాదని వెల్లడి
- పార్టీ అధిష్ఠానం, క్రమశిక్షణపై పూర్తి గౌరవం
- నోటీసును వెంటనే ఉపసంహరించాలని విజ్ఞప్తి

2



## సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం




- సుష్మిత.. జాగ్రత్త అంటూ ఇందిరా శోభన్ హెచ్చరిక

**హైదరాబాద్,ఆగస్ట్ 20 :**
మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పార్టీలోని అంతర్గత పరిణామాలను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. వచ్చే మిగతా 3వ పేజీలో..



## మిల్లర్లపై చర్యలకు రంగం సిద్ధం

ఈడీకి నివేదిక అందచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఆగస్ట్ 20:**
ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్‌లో బకాయిలను భారీగా ఎగవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లర్లపై సివిల్ సప్లయ్ మిగతా 3వ పేజీలో..

# తెలంగాణలో 22-ఎ సెక్షన్ దుర్వినియోగం

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. సెక్షన్ 22ఎ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ ఆపడానికి తెచ్చిన చట్టం అని, ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి కాదని తెలిపారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా 22ఎజాబితాలో పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల రాకెట్ నడుస్తోందని, నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించడానికి దళారులు మార్కెట్ విలువలో ఏకంగా 30% కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22A లో పెట్టారని నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల భూములపై వివాదాలు సృష్టించి రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్‌కు ఇవ్వాలని యజమానులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇంత కుంభకోణం జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. 22ఎపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా ఏ ఆస్తిని ఎవరు జాబితాలో చేర్చారు. ఎందుకు తొలగించారు.. మధ్యవర్తుల ప్రమేయం, ఆర్థిక లావాదేవీలపై తక్షణమే నిజాలు తేల్చాలని కోరారు. బినామీ సంస్థలను నడిపిస్తున్న రాజకీయ శక్తులు ఎవరో విచారణలో నిగ్గు తేల్చాలన్నారు. దశాబ్దాల క్రితమే అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద క్రమబద్ధీకరించిన ఆస్తులను, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న భూములను మళ్లీ 22ఎలో పెట్టి స్తంభింపజేయడం దుర్మార్గమన్నారు. జిల్లాల వారీగా 22ఎ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలన్నారు. ఏ భూమిని ఎప్పుడు చేర్చారు, ఎవరి ఆదేశంతో తీసేశారో ప్రజలకు పారదర్శకంగా తెలియాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పిన భూమాత.. భూ రికార్డులకు స్పష్టతనివ్వాలి అన్నారు. ఒక అవినీతి మంత్రిని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పణంగా పెడుతోందని విమర్శించారు. ఈ దోపిడీపై రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర విచారణకు ఆదేశించి రేవంత్ ప్రభుత్వం తన నిజాయతీని నిరూపించుకోవాలని, లేదంటే బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆరఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# 30శాతం కమీషన్ల వసూళ్లపై జవాబివ్వాలి

- **మాజీ మంత్రి తలసాని**

**హైదరాబాద్,ఆగస్టు 20:**
కమీషన్‌ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ తీసుకొచ్చిందని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల ఇండ్లు, ప్రయివేట్ భూములను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 22 ఏను అడ్డం పెట్టుకొని భూముల యజమానులను భయపెట్టి 30 నుండి శాతం కమీషన్లను వసూలు చేసిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం తప్పిదాలు చేసి అధికారులపై నెపం పెట్టి తప్పించుకోవాలని చూస్తున్నదని విమర్శించారు. కరోనా సమయంలో సరిపడా ఆక్సిజన్, బెడ్ లు లేక ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో కార్పొరేట్ స్థాయి హాస్పిటల్స్ నిర్మాణ పనులు చేపట్టిందని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 60 శాతం పనులు పూర్తయ్యాయనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సనత్ నగర్ టిమ్స్‌ను కట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అవివేకమని విమర్శించారు. హాస్పిటల్ లో అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే సోయి లేకుండా వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల ముందు ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తన భాషను మార్చుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ప్రజాపాలన అని ఒక వైపు ప్రచారం చేసుకుంటూ మరో వైపు నిర్బంధాలు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



# విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం

**మహాబలిపురం, ఆగస్టు 20:**
హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు.విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నారు. చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారని కర్ణాటక సీఎం డికె శివకుమార్ ప్రశంసించారు.

# 22ఏ కొలిక్కి వచ్చేనా?

**మొదటిపేజీ తరువాయి**

చేరడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు, భూ యజమానులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**పాత జాబితాతో పరిష్కారం?**
కొత్త జాబితాపై పెద్దఎత్తున అభ్యంతరాలు రావడంతో 2023 డిసెంబర్ నాటి పాత జాబితాను ప్రాతిపదికగా తీసుకుని లావాదేవీలు నిర్వహించే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పాత రికార్డుల ఆధారంగా ముందుకు వెళ్తే ప్రస్తుతం ఏర్పడిన అనేక వివాదాలను త్వరగా పరిష్కరించవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది నిర్ణయం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

**తప్పులను సరిచేస్తాం: పొంగులేటి**
22ఏ జాబితాలో ప్రైవేటు ఆస్తులు చేరిన విషయం వాస్తవమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే అంగీకరించారు. ప్రభుత్వ జీవోలు, మెమోల ద్వారా గతంలో హక్కులు పొందిన భూములకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో లేకపోవడంతో సమస్య తలెత్తిందని వివరించారు. ప్రభుత్వ భూములు కానివాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం రెవెన్యూ, స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖల ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, 15 రోజులపాటు సమస్యలను పరిష్కరించే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



**కొన్ని ప్రాంతాల్లో ఊరట**
ప్రభుత్వ ఆదేశాలతో పలు ప్రాంతాల్లో ఇప్పటికే నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించే ప్రక్రియ మొదలైంది. బాలానగర్ పరిధిలోని పలు సర్వే నంబర్ల భూములకు 22ఏ నిషేధం తొలగించినట్లు అధికారులు ప్రకటించారు. పోచారం గ్రామంలోని ఓ భూమిని పొరపాటున నిషేధిత జాబితాలో చేర్చినట్లు గుర్తించి క్లియరెన్స్ ఇచ్చారు. కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలోని సుమారు 300 ప్లాట్లకు కూడా నిషేధం తొలగించినట్లు సమాచారం.

**రాజకీయంగా మరింత వేడెక్కిన వివాదం**
22ఏ వ్యవహారంపై విపక్షాలు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాస్తూ, ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించేందుకు కమీషన్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా చేశారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండిస్తూ, జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామని చెబుతోంది.

22ఏ జాబితాలో నిజమైన ప్రభుత్వ భూములు, నిషేధిత కేటగిరీల భూములను కొనసాగిస్తూ, పొరపాటున చేర్చిన ప్రైవేటు ఆస్తులను తొలగించడమే ప్రభుత్వ ముందున్న ప్రధాన సవాలుగా మారింది. ప్రభుత్వం చేపడుతున్న సమీక్ష, ఉన్నతస్థాయి కమిటీ చర్యలు ఎంత వేగంగా సమస్యను పరిష్కరిస్తాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

# ప్రతీ ఫిర్యాదుకు పరిష్కారం తప్పనిసరి

**మొదటిపేజీ తరువాయి**

కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును ఫిర్యాదుగా కాక ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై అధికారులతో బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాల గురించి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా.. భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది.. దరఖాస్తుదారుడికి అర్హత ఉందా అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీమళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతోపాటు, గత రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్ పడకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 22ఎ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 'రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి.. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి.. చివరి వరకు పర్యవేక్షించండి.. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు.


**రేపటినుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు**
క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం చూపే దిశగా కార్యాచరణ
ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితంకాక క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశించే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించడంతోపాటు, దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లు సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలు, పరిష్కరించాల్సిన అంశాలను నేరుగా తెలుసుకునే విధంగా ఈ సమీక్షలను నిర్వహించనున్నారు.

**హౌసింగ్ అమలుపైనా సమీక్ష**
రెవెన్యూ అంశాలతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్ పథకాల అమలు, లబ్దిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు. జిల్లాల వారీగా చేపట్టనున్న సమీక్షల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

# 22-ఎ పేరిట భూ దోపిడీ

**మొదటిపేజీ తరువాయి**

ఓ ప్రకటనలో ఆరోపించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లే 22ఎ నిషేధిత జాబితాలోకి ఎక్కిందంటే ఇక రాష్ట్రంలో సామాన్యుడి ఆస్తికి ఏం భద్రత ఉంటుందని ప్రశ్నించారు. పరిస్థితి చేతులు దాటడంతోనే సీఎం స్పందించాల్సి వచ్చిందన్నారు. మంత్రి పొంగులేటి క్షమాపణలు చెప్పారంటేనే ఘోరమైన స్కాం జరిగిందని ప్రభుత్వం స్వయంగా ఒప్పుకున్నట్లేనని, తప్పు చేయనప్పుడు క్షమాపణలు ఎందుకు చెబుతున్నారని నిలదీశారు. రాత్రికి రాత్రే ప్రైవేట్ భూములను 22ఎలోకి మార్చడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేబినెట్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బాహాటంగా ఒప్పుకుంటున్నారంటే కాంగ్రెస్ సర్కారు లోపల జరుగుతున్న స్కామ్‌ను వాళ్లే బయట పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు సామాన్యుడి ఆస్తులనే బంగాళాఖాతంలో ముంచేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో 22 లక్షల ఎకరాలు వివాదాల్లో ఉన్నాయని నాడు మొసలి కన్నీరు కార్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోనే ఏకంగా లక్షల ఎకరాల ప్రైవేటు భూములను 22ఎ చిక్కుల్లోకి నెట్టారన్నారు. ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాల్సి వస్తుందేమోనని హైకోర్టు సైతం మొట్టికాయలు వేసే దుస్థితికి ఈ ప్రభుత్వం దిగజారిందన్నారు. పైసాపైసా కూడబెట్టుకుని కొనుక్కున్న స్థలాలను కాంగ్రెస్ పెద్దల కన్ను పడితే చాలు వివాదాల్లోకి నెట్టి కబ్జా చేయడమే లక్ష్యంగా మారిందని, హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన స్థలం కనిపిస్తే చాలు.. రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి ఎక్కించి ఆ తర్వాత సెటిల్‌మెంట్లకు తెరలేపుతున్నారని ఆయన ఆరోపించారు. ఆ లిస్టు నుంచి పేరు తీయాలంటే 30% నుండి 40% కమీషన్లు లేదా వాటాలు డిమాండ్ చేస్తూ ప్రజలను, బిల్డర్లను బెదిరిస్తున్నారన్నారు. బడాబాబుల జోలికి వెళ్లకుండా చిన్న ఉద్యోగులు, పేదలు కొనుక్కున్న 60, 100 గజాల ప్లాట్లను 22 ఎలో పెట్టి వారి కడుపు కొడుతున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, రెరా అనుమతులు ఉండి, బ్యాంకులు రుణాలు ఇచ్చి, రిజిస్ట్రేషన్ పూర్తయిన ఆస్తులను అకస్మాత్తుగా నిషేధిత జాబితాలో ఎలా పెడతారని లక్ష్మణ్ ప్రశ్నించారు. జూలైలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం దారుణంగా పడిపోయినా సర్కారుకు చీమ కుట్టినట్లయినా లేదని, ప్రభుత్వ ఖజానా కంటే నేతల జేబులు నిండటమే వీరికి ముఖ్యమని వ్యాఖ్యానించారు. పెద్దల భూములను రాత్రికి రాత్రే 22ఎ లిస్టు నుంచి తొలగిస్తూ సామాన్యుడిని నెలలతరబడి ఎందుకు తిప్పుకుంటున్నారని లక్ష్మణ్ నిలదీశారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా సామాన్యుల దరఖాస్తులు పరిష్కరించడానికి స్పష్టమైన కాలపరిమితితో కూడిన విధానాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అమలు చేయడం లేదన్నారు. విలువైన ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ భూములకు సర్వే నంబర్లు మార్చి బై నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ అనుయాయులకు పంచుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక 22ఎ జాబితా నుంచి ఎన్ని వేల ఎకరాలు తొలగించారు.. అందులో బడా కంపెనీలు, మంత్రుల బినామీలు ఎవరున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కాం బయట పడగానే అంతా అధికారుల తప్పిదమేనని చేతులు దులుపుకోవాలని చూస్తున్నారన్నారు. మంత్రుల ఆదేశాలు లేకుండానే అధికారులు ఇంత పెద్ద ఎత్తున చేస్తారా.. దొరికిపోగానే పదేళ్లుగా ఉన్న పాత అధికారుల కుట్ర అని చెప్పడం హాస్యాస్పదమని ఆయన అన్నారు. ఆ అధికారులకు కీలక పోస్టింగులు ఇచ్చింది మీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ప్రజలు దరఖాస్తులు చేసుకోనవసరం లేదని మంత్రులు మీడియా ముందు చెబుతూ క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్యుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసి ఆగం చేస్తున్నారన్నారు. అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను కూడా నిషేధిత జాబితాలో చేర్చి విక్రయాలు జరగకుండా అడ్డుకుంటున్నారన్నారు.




# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 21:**
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై దాఖలైన పిటిషన్ల విచారణలో తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేయడానికి ధర్మాసనం నిరాకరించింది. 2014 నుంచి అమలవుతున్న ఈ పథకాలకు చట్టబద్ధమైన ఆధారం ఏమిటని ప్రశ్నించిన కోర్టు.. కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీసింది.

**స్టే ఎత్తివేతకు నిరాకరణ**
పథకాలపై ఉన్న స్టేను తొలగించాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోరినప్పటికీ హైకోర్టు అందుకు అంగీకరించలేదు. పథకాల అమలుకు సంబంధించిన చట్టబద్ధత, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై స్పష్టత అవసరమని ధర్మాసనం పేర్కొంది.

**ఆర్థిక పరిస్థితిపై ఆందోళన**
రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర కీలక విభాగాలు నిధుల కొరత ఎదుర్కొంటున్న సమయంలో ఉచిత పథకాలకు ప్రజాధనం ఖర్చు చేయడంపై కోర్టు ప్రశ్నలు సంధించింది. రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితులను ప్రస్తావిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు 'డేంజర్ బెల్స్' మోగిస్తున్నాయని వ్యాఖ్యానించింది.

**సంస్థలను లాభాల్లోకి తేవాలని సూచన**
ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును నేరుగా ఉచిత పథకాలకు వెచ్చించే బదులు ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ముందుగా లాభాల్లోకి తీసుకురావాలని ధర్మాసనం సూచించింది. ఆయా సంస్థల ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ కార్యక్రమాలకు నిధులు సమకూర్చవచ్చని అభిప్రాయపడింది.

**భూ బాధితులపై అసహనం**
భూసేకరణలో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిహారం కోసం బాధితులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పేర్కొంది. ఈ వ్యవహారంలో తప్పుడు అఫిడవిట్ సమర్పించడంపైనా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది.

**స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆదేశం**
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చట్టబద్ధత, వాటికి కేటాయిస్తున్న బడ్జెట్, నిధుల వినియోగంపై ప్రభుత్వం పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

# సమన్వయం, డిజిటల్ వేదికలతో సత్వర న్యాయం

**మొదటిపేజీ తరువాయి**

సంయుక్తంగా ఈ వినూత్న సదస్సును నిర్వహించాయి. దేశంలోనే తొలిసారిగా కొత్త నేర చట్టాల డిజిటల్ అమలుకు సంబంధించిన అన్ని భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన కార్యక్రమంగా ఇది నిలిచింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చొరవతో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయాధికారులు, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అధికారులు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు. సదస్సును ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. "న్యాయం అనేది వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే సాధ్యమయ్యే సామూహిక ఫలితం" అని పేర్కొన్నారు. నేరం నమోదైనప్పటి నుంచి దర్యాప్తు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, న్యాయస్థానంలో విచారణ వరకు ప్రతి దశ కీలకమన్నారు. కొత్త నేర చట్టాల అమలులో సంస్థల మధ్య సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి విభాగం తన బాధ్యతతో పాటు ఇతర విభాగాలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సు ఒక్కసారితో ముగిసిపోకుండా నిరంతర సమన్వయానికి నాంది కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, అందుబాటులో ఉండే న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య మాట్లాడుతూ కొత్త నేర చట్టాల సమర్థ అమలుకు భాగస్వామ్య సంస్థల మధ్య మెరుగైన సమన్వయం అవసరమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పనిభారాన్ని పెంచకుండా ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు. ఒకే సమాచారాన్ని పదేపదే నమోదు చేయడం, అసంపూర్తి వివరాలు ఇవ్వడం వల్ల కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్నారు. పోలీస్ స్టేషన్ల నుంచి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో దర్యాప్తు అధికారులు తప్పులు, తప్పుడు కోడింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి తప్పుల వల్ల ప్రాసిక్యూషన్ పరిశీలన ఆలస్యమవుతోందన్నారు. పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్ల శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగంగా జరగాలని తెలిపారు. కొంతమంది సిబ్బందికి డిజిటల్ వేదికలపై పూర్తి అవగాహన లేకపోవడం కూడా జాప్యానికి కారణమవుతోందని పేర్కొంటూ, సామర్థ్య పెంపు, డిజిటల్ అక్షరాస్యతపై దృష్టి పెట్టాలని సూచించారు.

డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ కొత్త నేర చట్టాలు గత చట్టాల స్థానంలో కొత్త నిబంధనలు తీసుకురావడం మాత్రమే కాదని, పౌర కేంద్రిత న్యాయం, శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, కాలపరిమితితో కూడిన ప్రక్రియలకు ప్రాధాన్యం ఇచ్చే సమగ్ర మార్పు అని వివరించారు. దర్యాప్తుపై సమర్థవంతమైన పర్యవేక్షణ, డిజిటల్ సమాచారాన్ని పూర్తి, కచ్చితంగా నమోదు చేయడం, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న అన్ని డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించడం అవసరమన్నారు. సదస్సులో మూడు సాంకేతిక సెషన్లు నిర్వహించారు. పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు తమ అనుభవాలు, ఆచరణలో ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఐసీజేఎస్, ఈసాక్ష్య, ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల వినియోగం, ఈసమన్లు, దర్యాప్తు కాలపరిమితులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాక్ష్యాల నమోదు, న్యాయ సంహిత కాలపరిమితులు, న్యాయ శ్రుతి మాడ్యూల్, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అనుసంధానం, జైళ్ల నిర్వహణ, దర్యాప్తు-ప్రాసిక్యూషన్ సంస్థల మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. కొత్త నేర చట్టాల అమలు నిరంతర ప్రక్రియ కావడంతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి నెలా అమలు తీరుపై సమీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని డీజీపీ కోరారు. ఈ కార్యక్రమం మరింత సమగ్ర, సాంకేతిక ఆధారిత, పౌర కేంద్రిత న్యాయవ్యవస్థ నిర్మాణానికి తొలి అడుగుగా నిలిచింది. సదస్సుకు చొరవ చూపిన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీకి డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విజయసేనారెడ్డి, జస్టిస్ మాధవీదేవి, జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య, డీజీపీ సీవీ ఆనంద్, ఎన్‌సీఆర్‌బీ ప్రతినిధి ప్రశున్ గుప్తా, టీజీఎస్ఎఫ్ఎల్‌సీ డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ ప్రిన్సిపల్ శ్రీదేవి, సీడీటీఐ డైరెక్టర్ సల్మాన్ తాజ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, డీజీలు, ఐజీలు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలతో బలమైన భారత్

**హైదరాబాద్, ఆగస్టు 20:**

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం, ఐక్యతను పెంపొందించాలనే సందేశంతో నిర్వహించే సద్భావనా దినోత్సవం ప్రజలందరికీ స్ఫూర్తినిస్తుందని సీఎం పేర్కొన్నారు.

**సీఎం రేవంత్‌రెడ్డి నివాళి**

రాజీవ్ గాంధీని ఆధునిక భారత నిర్మాతగా పేర్కొంటూ ఆయన దేశానికి చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. దేశ ఐక్యత, అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ చూపిన మార్గం నేటికీ ఆదర్శప్రాయమని అన్నారు.

**సద్భావనే మన ప్రగతి**

'సమైక్యతే మన శక్తి-సద్భావనే మన ప్రగతి' అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యాన్ని బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**బలమైన భారత్ కోసం**

రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వంతో కూడిన బలమైన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# రాజీవ్ దార్శనికతతోనే ఆధునిక భారత నిర్మాణం

**శ్రీపెరంబుదూరు, ఆగస్ట్ 20 :**

దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా తమిళనాడులోని శ్రీ పెరంబుదూరులో ఉన్న రాజీవ్ గాంధీ మెమోరియల్ వద్ద కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘన నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ అందించిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ తన దార్శనికత, ఆధునిక ఆలోచనలతో భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు

నడిపించారని అన్నారు. ముఖ్యంగా సాంకేతిక, టెలికాం రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆయన పునాది వేశారని పేర్కొన్నారు. కంప్యూటర్లు, ఐటీ రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటి డిజిటల్ భారత నిర్మాణానికి బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, టెలికాం రంగాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించేందుకు, రాజీవ్ గాంధీ కృషి చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యా రంగానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని భట్టి విక్రమార్క తెలిపారు. 1986లో జాతీయ విద్యా విధానాన్ని తీసుకురావడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. సాంకేతికత, విద్య, ప్రజాస్వామ్యం, స్థానిక పాలన వంటి కీలక రంగాల్లో రాజీవ్ గాంధీ చేపట్టిన సంస్కరణలు ఆధునిక భారతదేశ నిర్మాణంలో చిరస్థాయిగా నిలిచిపోయాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

# మంత్రి పొంగులేటి భారీ అవినీతి

- చర్చకు సవాల్ చేసిన బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి కోసం ఎదురుచూపు

**హైదరాబాద్, ఆగస్ట్ 20:**

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భారీ అవినీతికి తెరలేపారని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి శ్రీనివాస రెడ్డికి బుధవారం సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి చేరుకున్నారు. ఈ సందర్భంగా తన సవాల్‌పై చర్చకు రావాలని మంత్రిని ఏలేటి మరోసారి డిమాండ్ చేశారు. తాను మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడే ఉంటానని, శ్రీనివాస రెడ్డి రావాలని డెడ్ లైన్ విధించారు. ఈ సందర్భంగా భూభారతి, 22ఏలో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థలకు భూ బదలాయింపులు జరిగాయన్నారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. పొంగులేటి వచ్చి వివరణ ఇచ్చే వరకు తాను కదిలేది లేదని తేల్చి చెప్పారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇస్తారా లేక పొంగులేటి ఇస్తారా అంటూ సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఎవరొచ్చినా సరే తన వద్ద ఉన్న ఆధారాలను అందిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# ఐఎస్ఐ ఉగ్ర నెట్‌వర్క్

- హైదరాబాద్‌లో కలకలం
- షహజాద్ భట్టి ముఠాతో సంబంధాలున్న ఇద్దరి అరెస్టు
- సోషల్ మీడియా ద్వారా యువతకు వల
- ఎన్‌క్రిప్టెడ్ చాటింగ్‌పై నిఘా
- మేడ్చల్, యూసుఫ్‌గూడలో ఇద్దరి అరెస్ట్
- 14 రాష్ట్రాల్లో 253 మంది అదుపులో
- ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు ముమ్మరం

**హైదరాబాద్, ఆగస్టు 21:**

పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్న గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టి టెర్రర్ నెట్‌వర్క్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెలుగు చూడటం కలకలం రేపుతోంది. దేశవ్యాప్తంగా నిశ్శబ్ద విధ్వంసానికి కుట్రలు పన్నుతున్న ఈ నెట్‌వర్క్‌పై కేంద్ర నిఘా వర్గాలు, వివిధ రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో తెలంగాణకు చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

**సోషల్ మీడియా ద్వారా వల**

షహజాద్ భట్టి సామాజిక మాధ్యమాల్లో రీల్స్, వీడియోల ద్వారా యువతను ఆకర్షిస్తున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. తన పోస్టులకు స్పందించే యువకులను సంప్రదించి, వారిని నెట్‌వర్క్‌లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. డబ్బు, ఇతర ప్రలోభాలతో దేశ వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించినట్లు అధికారులు భావిస్తున్నారు.

**మేడ్చల్, యూసుఫ్‌గూడలో అరెస్టులు**

హైదరాబాద్‌లోని నెట్‌వర్క్ కార్యకలాపాలపై నిఘా పెట్టిన కేంద్ర వర్గాలు నగర పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించాయి. మేడ్చల్‌కు చెందిన జాయిద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఐఎస్ఐ అనుకూల వ్యక్తులతో అతడు ఎన్‌క్రిప్టెడ్ చాటింగ్ చేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. గత రెండు, మూడు నెలలుగా అతడి కదలికలపై నిఘా కొనసాగించినట్లు తెలుస్తోంది. ఇదే నెట్‌వర్క్‌తో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న యూసుఫ్‌గూడకు చెందిన మరో యువకుడిని కూడా అరెస్టు చేశారు.

**14 రాష్ట్రాల్లో 253 మంది అదుపులో**

నెట్‌వర్క్ కార్యకలాపాలను ఛేదించేందుకు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ చర్యల్లో 253 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణలో ఇద్దరు పట్టుబడ్డారు. నిందితుల విచారణ కొనసాగుతుండటంతో ఉగ్ర కుట్రలు, ఆర్థిక లావాదేవీలు, నగరంలో వారికి సహకరిస్తున్న ఇతర వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**భట్టి గత చరిత్రపై ఆరా**

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన షహజాద్ భట్టి గతంలో దోపిడీలు సహా పలు నేరాల్లో పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్నాయి. అనంతరం లాహోర్ నేర ప్రపంచంలో అతడి పేరు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. 2013లో అతడిపై పలు కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పాకిస్థాన్ నుంచి యూఏఈకి వెళ్లిన భట్టి వ్యాపారాలు నిర్వహించినట్లు ప్రచారం చేసుకున్నాడు.

**సోషల్ మీడియానే అడ్డాగా?**

టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికల ద్వారా భట్టి తన పరిచయ వర్గాన్ని విస్తరించుకున్నట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. మతపరమైన, జాతీయవాద, వివాదాస్పద అంశాలపై వీడియోలు, పోస్టులు చేస్తూ పెద్ద సంఖ్యలో అనుచరులను సంపాదించుకున్నట్లు చెబుతున్నాయి. ఈ ప్రభావాన్ని ఉపయోగించి యువతను ఆకర్షించి, రహస్యంగా ఐఎస్ఐ నెట్‌వర్క్ కోసం పనిచేసినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రాజీ లేని పోరు

**కరీంనగర్, ఆగస్టు 20 :**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రాష్ట్రంలోని విద్యార్థి లోకం ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో బుధవారం నిర్వహించిన ఫీజు బకాయి - బీజేపీ లడాయి మహా ధర్నా కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రామచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ముందు సంక్షేమ రాజ్యం తెస్తామని చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి హయాంలో ప్రభుత్వం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆయన మండిపడ్డారు. హైకోర్టు మొట్టికాయలు వేయడంతోనే రూ.2 వేల కోట్లు అడ్వాన్స్‌గా ఇస్తామని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని, అయితే ఇప్పటివరకు పైసా కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని, కాలేజీ యాజమాన్యాలకు నిధులు అందక అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేక విద్యాసంస్థలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక, మానసిక క్షోభను అనుభవిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ఇచ్చిన 'యూత్ డిక్లరేషన్' హామీలు గాలికి కొట్టుకుపోయాయని, కాంగ్రెస్ పార్టీ వలసవాద ఆలోచనా ధోరణితో వ్యవహరిస్తూ విద్యార్థుల భవిష్యత్తును విస్మరిస్తోందని విమర్శించారు. ఫీజు బకాయిలను సాధించే వరకు విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాడుతూనే ఉంటుందని రామచందర్‌రావు స్పష్టం చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల సాధనకు, స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం నెల రోజులుగా బీజేవైఎం క్షేత్రస్థాయిలో అలుపెరగని పోరాటం చేస్తోందని తెలిపారు. విద్యార్థుల ఆందోళనలను చూసి భయపడి కాలేజీ యాజమాన్యాలకు, విద్యార్థులకు పోలీసులు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే కలెక్టరేట్లను ముట్టడించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, లేనిపక్షంలో సీఎం రేవంత్.. తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మిల్లర్లపై చర్యలకు రంగం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**

శాఖ చర్యలకు సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి భారీ మొత్తంలో బకాయిపడిన 20 మంది రైస్ మిల్లర్ల జాబితాను సివిల్ సప్లయ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అందజేసినట్లు సమాచారం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా నిలిపివేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అంతేకాక ధాన్యం లావాదేవీల్లో అక్రమ మార్గాల్లో నిధులు సమీకరించడం.. హవాలా రూపంలో డబ్బులు సంపాదించడం వంటి ఆరోపణలు కూడా మిల్లర్లపై ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలు, ధాన్యం కొనుగోళ్లు.. మిల్లింగ్‌కు సంబంధించిన రికార్డులపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఈడీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ధాన్యం బకాయిలను చెల్లించకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మిల్లర్లపై కఠిన చర్యలకు పోలీస్ శాఖ కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం తొమ్మిది మంది రైస్ మిల్లర్లపై పీడీ యాక్ట్ ప్రయోగించే దిశగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడం, బకాయిలను భారీగా పెండింగ్‌లో ఉంచడం, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు అనుమానాలు ఉండటంతో ఈ చర్యలకు అధికారులు సిద్ధమైనట్లు భావిస్తున్నారు.

# అర్ధరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

**సిద్దిపేట, ఆగస్ట్ 20:**

సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఆమె వ్యక్తిగతం.. నాకు సంబంధం లేదు

**హైదరాబాద్, ఆగస్టు 21:**

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసుపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి రాసిన లేఖలో తన వైఖరిని స్పష్టం చేశారు. ఇటీవల తన కుమార్తె కొండా సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అవి పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని పేర్కొన్నారు.

**కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతం**

కుటుంబ బంధాల కారణంగా ఒకరు చేసిన వ్యాఖ్యలకు మరొకరిని రాజకీయంగా బాధ్యులను చేయడం సరికాదని సురేఖ పేర్కొన్నారు. తన కుమార్తె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు తనను బాధ్యురాలిని చేయడం న్యాయసూత్రాలకు విరుద్ధమని లేఖలో వివరించారు.

**పార్టీపై పూర్తి గౌరవం**

కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, అధిష్ఠానం నిర్ణయాలు, పార్టీ క్రమశిక్షణ నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలను, క్రమశిక్షణను తాను ఎప్పుడూ గౌరవిస్తానని పేర్కొన్నారు.

**తన ప్రమేయం లేదని వెల్లడి**

వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని సురేఖ తెలిపారు. ఈ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తన ప్రమేయం లేని అంశంలో తనకు నోటీసు జారీ చేయడం సరికాదని పేర్కొన్నారు.

**నోటీసు ఉపసంహరణకు విజ్ఞప్తి**

కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం తగదని పేర్కొంటూ జారీ చేసిన నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. తన వివరణను పరిగణనలోకి తీసుకుని ఈ అంశాన్ని ముగించాలని విజ్ఞప్తి చేశారు.

# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి**

శాసనసభ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తనకు పూర్తి అర్హతలు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నట్లు సుష్మిత బహిరంగంగా ప్రకటించారు. పార్టీ స్థాపన, అభివృద్ధిలో తమ కుటుంబం చేసిన త్యాగాలను వివరిస్తూ తమకు జరుగుతున్న అన్యాయంపై మౌనంగా ఉండేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్లి పోరాడతానని సీఎం వర్గానికి, పార్టీ నాయకత్వానికి ఆమె స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు సొంత పార్టీలోనే కాక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. తాజాగా దీనిపై గాంధీ భవన్‌లో కాంగ్రెస్ మహిళా నేతలు ఏర్పాటు చేసిన డియా సమావేశంలో కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్, కొండా సుష్మితపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'సుష్మితా.. మాటలు జాగ్రత్త' అంటూ హెచ్చరించిన ఆమె సుష్మిత వైఖరిని, ప్రవర్తనను పూర్తిగా తప్పుబట్టారు. కొండా సురేఖ తమ అక్క కాబట్టి ఆ బంధాన్ని గౌరవిస్తూనే సుష్మితకు అక్క కూతురిగా మర్యాద ఇస్తున్నామన్నారు. అయితే అసలు సుష్మిత పార్టీలో ఉందా లేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేల గురించి ముఖ్యమంత్రి మాట్లాడకపోతే ఇంకెవరి గురించి మాట్లాడతారని ప్రశ్నిస్తూ పార్టీ లైన్‌లో ఉండి పని చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. సుష్మిత తీరు ఆమె తల్లిదండ్రుల పెంపకాన్నే ప్రశ్నించేలా ఉందని ఇందిర వ్యాఖ్యానించారు. సినిమాలు చూసి డ్యామేజీ డైలాగులు కొట్టడం రాజకీయాల్లో నడవదని స్పష్టం చేశారు. సుష్మిత వెనక ఉండి బీఆర్ఎస్ లేదా బీజేపీ నేతలు ఇలా మాట్లాడిస్తున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. మంత్రి పదవి తన తల్లికి దక్కిందంటే అది ఆమె కుటుంబానికి, సామాజిక వర్గానికి వచ్చిన గౌరవమే కదా అని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన వారికి ఏ పదవులు లేకపోయినా వారిని వివాదాల్లోకి లాగడం సరికాదన్నారు. గతంలోనే సురేఖ ఒకసారి క్షమాపణలు చెప్పారని, ఇప్పుడు మళ్లీ ఇలాంటి వివాదాలు సృష్టించడం వల్ల పక్క పార్టీలకే అవకాశం ఇచ్చినట్లవుతుందని మండిపడ్డారు. ఎవరిపైన అయినా చిట్టా ఉంటే దానిని దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలని, బెదిరింపులకు దిగకూడదని సూచించారు. పొలిటికల్ మెచ్యూరిటీ లేకుండా మాట్లాడుతున్నావంటూ రేవంత్ రెడ్డి అభిమానులు ఇలాంటి వ్యాఖ్యలను చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కౌంటర్ ఇస్తే మరింత రెచ్చిపోతానని సుష్మిత అంటున్నారని, అలా రెచ్చిపోతే నష్టపోతావని గట్టిగా హెచ్చరించారు. పార్టీ కోసం ఎంతో కష్టపడిన కార్యకర్తలకు పదవులు అడగాలి తప్ప, తనేం చేసిందని ఎమ్మెల్యే పదవి కోరుతోందో చెప్పాలన్నారు. ఇకనైనా సుష్మిత ప్రవర్తన మార్చుకోవాలని హితవు పలికారు.

# మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

- ప్రసవం కోసం వెళ్లినపుడు నిర్లక్ష్యంగా సర్జరీ



**ముంబై, ఆగస్టు 20 :**

ప్రసవం కోసం హాస్పిటల్‌కు వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ ఆమె కడుపులోనే వదిలేసి కుట్లు వేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపు నొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్య శాఖ విచారణకు ఆదేశించింది. వడ్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఈనెల 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా హాస్పిటల్‌లో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్ది రోజులకే ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ □ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ స్కానింగ్‌లో ఆమె కడుపులో ఏవో వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పుణెలోని సాసూన్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి, ఆమె కడుపులో ఉన్న గ్లౌజులు, పేపర్ వైప్స్ ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. తన భార్య పరిస్థితికి మొదటి ఆపరేషన్‌లో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సంధ్య భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

# వందేమాతరంపై రాజకీయ వివాదం

- కాంగ్రెస్ తీరును ఎండగట్టిన బీజేపీ
- కొత్త ముస్లింలీగ్ పార్టీ అంటూ నబీన్ విమర్శలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20 :**

జాతీయ గేయం వందే మాతరం ఆలాపన విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న తమ 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నిర్ణయం ఆ పార్టీ దేశ భక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆరోపించింది. ఓట్ల కోసం కాంగ్రెస్ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో తీవ్రస్థాయిలో స్పందించారు. వందేమాతరాన్ని అవమానించడం అంటే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని మండిపడ్డారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని, ఇకపై పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని సీడబ్ల్యూసీ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. ఈనెల 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో చోటు చేసుకున్న వివాదాన్ని నబీన్ పరోక్షంగా ప్రస్తావించారు. వందేమాతరంపై తన వైఖరిని కాంగ్రెస్ తీర్మానం రూపంలో అధికారికం చేసిందన్నారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ సమర్థన కాదని, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది మాట్లాడుతూ వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశ భక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పుడు జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ప్రశ్నించారు. రాజ్యాంగం, పార్లమెంట్, దేశం కంటే పార్టీ నిర్ణయానికే కాంగ్రెస్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ తీరు చారిత్రక ముస్లిం లీగ్ వైఖరిని గుర్తుకు తెస్తోందని, ఆ పార్టీ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని ఆరోపించారు. 1931లో వందే మాతరం పూర్తి రూపంపై ముస్లిం లీగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ నిర్ణయం కూడా అదే తరహా మొండితనాన్ని ప్రతిబింబిస్తోందని బీజేపీ విమర్శించింది.

# రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ ఘన నివాళి

- వీర్ భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం
- ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:**

మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీర్ భూమిని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమానికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారత దేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ 'ఎక్స్' వేదికగా మోదీ పోస్టు చేశారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం, ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాక భిన్నత్వంలో ఏకత్వం అనే దేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు.



# వందేమాతరంపై కాంగ్రెస్ కొత్త నిర్ణయం

- మొదటి రెండు చరణాలకే పరిమితం..
- బీజేపీ తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:**



కాంగ్రెస్ నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ భావాలను పక్కనపెడుతోందని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. గతంలో వందేమాతరాన్ని రెండు భాగాలుగా చూడటం వల్ల దేశం తీవ్ర పరిణామాలను ఎదుర్కొందని, ఇప్పుడు అదే విధానాన్ని కాంగ్రెస్ మళ్లీ అనుసరిస్తోందని ఆరోపించారు. వందేమాతరం రచయిత బంకిం చంద్ర ఛటర్జీతో పాటు స్వాతంత్ర్య సమరయోధులను కాంగ్రెస్ అవమానిస్తోందని అన్నారు.

**కొత్త ముస్లిం లీగ్ అంటూ నితిన్ నబీన్**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో వేలాది మంది అమరవీరులకు వందేమాతరం స్ఫూర్తినిచ్చిందని, అలాంటి గేయాన్ని పరిమితం చేయడం దేశ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపిస్తూ, ఆ పార్టీని కొత్త ముస్లిం లీగ్‌తో పోల్చారు.

**1937 నాటి తీర్మానమే ఆధారం**

కాంగ్రెస్ మాత్రం తాము కొత్తగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెబుతోంది. 1937లో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వల్లభ్‌భాయ్ పటేల్, అబుల్ కలాం ఆజాద్ తదితరులతో కూడిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్నే ఇప్పుడు కొనసాగిస్తున్నామని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అప్పట్లో జాతీయ సభల్లో వందే మాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**మిగతా చరణాలపై అభ్యంతరాలు**

వందేమాతరం గేయంలో మొత్తం ఆరు చరణాలు ఉన్నాయి. మొదటి రెండు చరణాల్లో ప్రకృతి అందాలు, నదులు, పచ్చని పంట పొలాలు, మాతృభూమి గొప్పతనాన్ని వర్ణిస్తారు. మిగిలిన చరణాల్లో మాతృభూమిని దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతలతో పోల్చడం, యుద్ధ భావనలను ప్రస్తావించడం వంటి అంశాలపై గతంలో కొన్ని వర్గాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీంతో అన్ని వర్గాల ఆమోదం కోసం మొదటి రెండు చరణాలకే పరిమితం చేయాలనే అభిప్రాయం అప్పట్లో వ్యక్తమైంది.

**కొత్త ప్రోటోకాల్‌తో మళ్లీ వివాదం**

వందేమాతరం 150 ఏళ్ల వేడుకల నేపథ్యంలో గతంలో పార్లమెంట్‌లోనూ ఈ అంశంపై చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ గేయానికి సంబంధించి కొత్త అధికారిక ప్రోటోకాల్‌ను తీసుకొచ్చిన నేపథ్యంలో వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పూర్తి గేయాన్ని ఆలపించాలనే కేంద్ర విధానానికి, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో మొదటి రెండు చరణాలకే పరిమితం కావాలనే నిర్ణయానికి మధ్య స్పష్టమైన భేదం ఏర్పడింది. దీంతో వందేమాతరం అంశం రానున్న రోజుల్లోనూ రాజకీయంగా వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.


# రాజకీయంగా మోదీ, అమిత్ షా పని అయిపోయింది

- ప్రతిపక్ష కూటమి మరింత బలోపేతం
- కాంగ్రెస్ సమావేశంలో అగ్రనేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :**

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై లోక్సభ లో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని, మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయింద ని అన్నా రు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లా డుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడంవల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపో యాయని రాహుల్ గాంధీ అన్నారు. గతంలో చూపిన రాజ కీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పో యిందని పేర్కొన్నారు. ఈ నేప థ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యక ర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరిం త తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



# సిక్కు వ్యతిరేక అల్లర్లలో నిందితుడి మృతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 20 :**

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్(80) మృతిచెందారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు హాస్పిటల్ వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాస సముదాయాలపై దాడులు జరిగాయి. అనేకమంది చనిపోయారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకర్గం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు.



# బార్ అసోసియేషన్ కు జంధ్యాల ఎన్నిక

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :**

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో జంధ్యాల రవి శంకర్ ఘన విజయం సాధించారు. అసోసియేషన్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జంధ్యాల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్లు, గవర్నర్లకు న్యాయ సలహాదారుగా రవిశంకర్ విశేష సేవలు అందించారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. 2023 నుంచి సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రవిశంకర్ పలు కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తరపున సుప్రీంకోర్టులో వాదించారు. తెలంగాణలోనూ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన పిటిషన్లలో అసెంబ్లీ స్పీకర్ తరఫున రవిశంకర్ వాదనలు వినిపిస్తున్నారు.

# పాఠశాలల దుస్థితిపై సీజేపీ ఆగ్రహం

- విద్యార్థులకు కనీస వసతులు లేవు: అభిజీత్ దీప్కే
- విద్యాశాఖ మంత్రి దాదా భుసే రాజీనామాకు డిమాండ్
- పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతపై విమర్శలు
- పాములకు నిలయాలుగా మారుతున్న పాఠశాలల ఆవరణలు
- ప్రజాప్రతినిధులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచన
- 2029 నాటికి జెన్‌జీ కీలక ఎన్నికల శక్తిగా మారుతుందని వ్యాఖ్య

**లాతూర్, ఆగస్టు 21:**

మహారాష్ట్రలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు పెంచుకునే కుక్కలకు ఉన్న సదుపాయాలు కూడా విద్యార్థులకు లేవని విమర్శించారు. మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భుసే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**పాఠశాలల దుస్థితిపై పరిశీలన**

'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమంలో భాగంగా సీజేపీ బృందం లాతూర్ జిల్లా ఔసా తహసీల్‌లోని ఉజని జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించింది. రేకుల పైకప్పుల నుంచి నీరు కారడం, అపరిశుభ్రత, చెత్తాచెదారంతో పాఠశాల పరిసరాలు అధ్వానంగా మారాయని దీప్కే పేర్కొన్నారు.

**పాములకు నిలయాలుగా ఆవరణలు**

పాఠశాలల్లో సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, సురక్షిత రహదారులు వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని ఆయన ఆరోపించారు. పాఠశాల ఆవరణలు పాములకు నిలయాలుగా మారుతున్నాయని, పాముకాటుతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

**నాయకులపై దీప్కే విమర్శలు**

విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులకు ప్రజలు ఎందుకు ఓటేయాలని దీప్కే ప్రశ్నించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే అక్కడి సమస్యల తీవ్రత రాజకీయ నాయకులకు అర్థమవుతుందని అన్నారు. పాఠశాలల పరిస్థితులు మెరుగుపడే వరకు నాయకులను ఓట్ల కోసం గ్రామాల్లోకి రానివ్వకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు.

**పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి**

'ధర్మం ప్రమాదంలో ఉంది' అంటూ రాజకీయాలు చేసే నాయకులు విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతున్న విషయాన్ని గుర్తించాలని దీప్కే సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

**2029లో జెన్‌జీ కీలకం**

2029 ఎన్నికల నాటికి జెన్‌జీ యువత కీలక ఎన్నికల శక్తిగా మారుతుందని దీప్కే పేర్కొన్నారు. యువత సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే గ్రామాల స్థాయిలో పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతాయని హెచ్చరించారు. లాతూర్ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో సీబీఐ దర్యాప్తు కింది స్థాయి నిందితులకే పరిమితమైందని ఆరోపించారు. భారీ కుంభకోణం వెనుక ఉన్న పెద్దల పాత్రను వెలికితీయాలని డిమాండ్ చేశారు.



## ఆయుధాలతో దోపిడీ చేసిన కేసులో ఒక నిందితుడి అరెస్టు





**హైదరాబాద్, ఆగస్టు20 ::** ట్రాన్స్జెండర్ వ్యక్తులపై ఆయుధాలతో దాడి చేసి దోపిడీ చేసిన ఓనింధితుడిని కేపీహెచ్బీ పోలీసులు అరెస్టు చేశారు.వివరాల ప్రకారం.......ఈనెల 15,16 తెదిలలోమధ్యరాత్రి, కారు ,ఆటోలో వచ్చిన నిందితుల ముఠా ఒక ట్రాన్స్జెండర్ వ్యక్తిని అడ్డగించి, కత్తితో బెదిరించి, ఆమె వద్దనున్న ఐఫోన్ మరియు బంగారు చెవి కమ్మలను దోచుకున్నట్లు ఆరోపణ.అనంతరం అదే ముఠా కేపీహెచ్బీ 4వ ఫేజ్లోని ఒక ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి, ఇంట్లో ఉన్నవారిని బెదిరించి, దాడి చేసి, మొబైల్ ఫోన్లు మరియు బంగారు చెవి కమ్మలను దోచుకొని పరారైంది.

### నిందితుడి అరెస్టు – సొత్తు స్వాధీనం

సీసీటీవీ ఫుటేజ్ మరియు సాంకేతిక ఆధారాలను పరిశీలించిన కేపీహెచ్బీ పోలీసులు కింది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు:నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా, స్వతంత్ర పంచసాక్షుల సమక్షంలో అతని నివాసంలో రహస్యంగా దాచిన ప్రదేశం నుంచి ఒక యాపిల్ ఐఫోన్, సుమారు 5 గ్రాముల బరువున్న కింది సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నిందితుడికి గతంలో దోపిడీ , హింసాత్మక నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు అనుమానం ఉంది. అతని పూర్వ నేరచరిత్రను పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న మిగతా నిందితులను పట్టుకోవడానికి, మిగిలిన సొత్తు, ఆయుధాలు మరియు నేరానికి ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

### ప్రజలకు పోలీసుల సూచనలు

కొన్ని ముఠాలు మహిళలు లేదా సెక్స్ వర్కర్లను ఏర్పాటు చేస్తామని చెప్పి వ్యక్తులను లాడ్జీలు, OYO గదులు లేదా నిర్మానుష్య ప్రాంతాలకు పిలిపించి, అనంతరం బెదిరించి, దాడి చేసి లేదా బ్లాక్మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసే అవకాశం ఉంది.కాబట్టి ప్రజలుచట్టవిరుద్ధ లైంగిక సేవలు ఏర్పాటు చేస్తామని చెప్పే వ్యక్తులను సంప్రదించవద్దన్నారు. బెదిరింపులకు భయపడి నగదు ఇవ్వడం లేదా ఆన్లైన్లో డబ్బులు బదిలీ చేయడం చేయవద్దన్నారు.బెదిరింపు కాల్స్, చాటింగ్, యుపీఐ వివరాలు మరియు వాహన నంబర్లను ఆధారాలుగా భద్రపరచాలన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే డయల్–112కు కాల్ చేయాలి. చట్టప్రకారం ఫిర్యాదుదారుల గోప్యతను కాపాడేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటారు. రాత్రి సమయంలో అధీకృత యాప్ ఆధారిత ఆటోలు లేదా క్యాబ్లను వినియోగించాలి. వాహన నంబర్ను పరిశీలించి కుటుంబ సభ్యులకు పంపాలి. అనుమానాస్పదంగా తిరుగుతున్న లేదా గుర్తుతెలియని వ్యక్తులు ఉన్న ఆటోల్లో ఎక్కవద్దు. రోడ్డుపై నడుస్తూ మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దు. ఫోన్ను చేతిలో లేదా చొక్కా పై జేబులో కాకుండా భద్రమైన కింది లేదా జిప్ ఉన్న జేబులో ఉంచుకోవాలి. సమాజంలోని ప్రతి వర్గానికి రక్షణ కల్పించేందుకు కేపీహెచ్బీ పోలీసులు కట్టుబడి ఉన్నారు. బెదిరింపులు, బలవంతపు వసూళ్లు, దోపిడీలు మరియు దోపిడీ ముఠాల కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు.అత్యవసర సహాయం కోసం డయల్–112కు కాల్ చేయండి.

## మిరుదొడ్డిలో ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు20 :**
:



మిరుదొడ్డి మండల కేంద్రంలో భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 82వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, మండల అధ్యక్షులు నర్ర రాజిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నేరెళ్ల భూమ గౌడ్ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే దేశ ప్రధానమంత్రి పదవిని చేపట్టి భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన మహానేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశాన్ని ఆధునిక సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యంగా దేశంలో ఐటీ, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ పునాదులు వేశారని గుర్తుచేశారు. యువతకు రాజకీయ ప్రక్రియలో మరింత భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. దేశ అభివృద్ధి, యువత భవిష్యత్తు, సాంకేతిక పురోగతిపై దూరదృష్టితో నిర్ణయాలు తీసుకున్న రాజీవ్ గాంధీ సేవలు నేటి తరానికి స్ఫూర్తి దాయకమని వారు అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చెన్నె భూపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, రామకృష్ణ, గడ్డం నరస గౌడ్, ధర్మారం ఎల్లం, సుంకరి రాజ్యం, రత్నారెడ్డి, ఎర్రోళ్ల నర్సింలు, గుడ్డెల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో మొలంగూర్ జీపీఓ



- **రూ.20 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన శ్రీనివాస్**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి క్షేత్రస్థాయి నివేదిక సిద్ధం చేసి పట్టాదార్ పాస్‌బుక్ జారీ చేయడానికి రూ.20 వేల లంచం తీసుకుంటూ శంకర్‌పట్నం మండలం మొలంగూర్ గ్రామ పాలన అధికారి (జీపీఓ) కంపేటి శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గురువారం సాయంత్రం 5.47 గంటలకు శంకరపట్నం తహసీల్ కార్యాలయంలో కరీంనగర్ ఏసీబీ యూనిట్ అధికారులు ట్రాప్ నిర్వహించారు. ఏసీబీ విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రకారం.. ఫిర్యాదుదారుడి నుంచి తొలుత రూ. 15 వేలు లంచం డిమాండ్ చేసిన శ్రీనివాస్, అనంత రం మరో రూ.5 వేలు అదనంగా డిమాండ్ చేయడంతో మొత్తం రూ.20 వేలకు లంచం డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారు అందించిన రూ.20 వేల లంచం మొత్తాన్ని శ్రీనివాస్ స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. శ్రీనివాస్ వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు, అతని ఎడమ చేతి వేళ్లు, ప్యాంటు వెనుక ఎడమ జేబుపై నిర్వహించిన రసాయన పరీక్షల్లో పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమ లబ్ధి పొందేందుకు లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కరీంనగర్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదు. డీఎస్పీ మహేందర్ రెడ్డి, సీఐలు తిరుపతి, ప్రేమ్‌కుమా, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం





**సంక్షేమ పథకాలన్నీ మహిళలకే: ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటినీ మహిళలకు అందిస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం శంకరపట్నం మండలం లోని కేశవపట్నం, కన్నాపూర్ గ్రామాల్లో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన ప్రారంభించారు. మొలంగూర్, కొత్తగట్టు, కన్నాపూర్, కేశవపట్నం, తాడికల్ గ్రామాల్లో గ్రామైక్య సంఘ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కేశవపట్నంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను మహిళలకు అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్, పావలా వడ్డీ రుణాలతో పాటు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. మహిళలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణ అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కన్నాపూర్ గ్రామంలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణంలో లోపాలు ఉన్నాయని గుర్తించిన ఎమ్మెల్యే సంబంధిత ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ నాణ్యతపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగట్టు గ్రామంలో అండర్‌పాస్ నిర్మించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో అనిత, టీపీసీసీ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, సహకార సంఘాల చైర్మన్లు బసవయ్య, మహేష్ సంపత్, గట్టు తిరుపతి, మార్కెట్ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కేశవపట్నం సర్పంచ్ రాజేంద్ర ప్రసాద్, కన్నాపూర్ సర్పంచ్ నూనె రమా శ్రీనివాస్, తాటికొండ సదానందం, అర్ధం కుమార్, రవి, శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఏఈపై ఎమ్మెల్యే ఆగ్రహం

**నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలపై అసంతృప్తి**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. అనంతరం భవనాన్ని పరిశీలించగా నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు కనిపించడంతో సంబంధిత ఏఈ రమేష్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత భవనానికి రంగులు వేసినట్టుగా ఉందంటూ అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. వైద్య సిబ్బంది, గ్రామ మహిళలను పనుల నాణ్యతపై ఆరా తీశారు. భవన నిర్మాణంలో ఉన్న లోపాలను వెంటనే సరిచేసి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

- **నూతన ప్రభుత్వ కార్యాలయాలకు శంకుస్థాపన..**
- **నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీ పరిశీలన**



**శెనార్తి మీడియా, జగిత్యాల:**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జిల్లాకు చేరుకోనున్న మంత్రి ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన జగిత్యాల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు.అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చేరుకోనున్నారు. మధ్యాహ్నం 1 నుంచి 1.30 గంటల వరకు కాలనీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడనున్నారు.మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు జగిత్యాలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో గృహ నిర్మాణం, రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.మంత్రి పర్యటనకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## 22ఎ నిషేధిత భూముల జాబితాలను జాగ్రత్తగా పరిశీలించాలి

- **మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**



**హైదరాబాద్, ఆగస్టు20 :** 22ఎ నిషేధిత భూముల జాబితాలను జాగ్రత్తగా పరిశీలించి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను అప్లోడ్ చేస్తూ యూ ఎల్ సి కి సంబంధించిన పెండింగ్ క్లియర్ చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ యు ఎల్ సి విభాగాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ 22 ఎ నిషేధిత భూములు మరియు అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలోని దరఖాస్తుల క్లియరెన్స్ కు రీటైనేబుల్ భూముల వివరాలను పరిశీలించి ప్రభుత్వ జీవోల ప్రకారం అప్‌లోడింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజావాణి హాల్‌లో వివిధ మండలాల నుండి వచ్చిన సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, డీఐలు , కంప్యూటర్ ఆపరేటర్లు రాత్రి వేళల్లో కూడా పనులు పూర్తి చేయాలన్నారు. యుఎల్సీ ఆన్‌లైన్ డేటాను త్వరగా క్లియర్ చేసేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు.దరఖాస్తుల ప్రక్రియను సత్వరమే పూర్తి చేసేందుకు రాత్రి వేళల్లో సైతం పనులను వేగవంతంగా నిర్వహించాలన్నారు



## తెలుగు మహిళల హృదయ నేత్రి

# మాలతీ చందూర్

### నేడు మాలతీ చందూర్ వర్ధంతి

ప్రపంచం గర్వించదగ్గ తెలుగు స్త్రీవాద రచయిత్రి మాలతీ చందూర్. చదువు ఎక్కువగా చదువక పోయినా, తెలుగు భాషకు, తెలుగు మహిళకు పట్టాభిషేకం చేసి, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతగా గుర్తింపు పొందిన ప్రతిభాశాలి. రచయిత్రిగా, కాలమిస్టుగా, 1950ల నుండి దాదాపు మూడు దశాబ్దాల పాటు తెలుగువారికి ఆమె సుపరిచితం. మాలతీ చందూర్ (1930 – ఆగష్టు 21, 2013) కృష్ణా జిల్లా లోని నూజివీడులో 1930 లో జన్మించారు. ఊర్లో ఉయ్యూరు రాజావారి దివాణం పక్కనే ఎస్ఆర్ఆర్ పాఠశాలలో 8వ తరగతి వరకు ఎస్ఎస్ఆర్ పాఠశాలలోనే చదివారు. 8వ తరగతి పూర్తి కాగానే ఏలూరు వెళ్ళి, అక్కడ వారి మామయ్య (చందూర్) ఇంట్లో ఉండి చదువు కున్నారు. ఏలూరు లోని వల్లూరు సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేరారు. అప్పుడు చందూర్ గారి ద్వారా డి.కామేశ్వరి, ఆనందా రామం, అరవిందా చారి, సక్కుబాయి వంటి వారితో పరిచయం ఏర్పరుచు కున్నారు. ఏలూరులో వారున్న ఇంటికి దగ్గరగా 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ఉండేది. అక్కడికి శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకటచలం, కావలి లక్ష్మీనరసింగం మొదలైన వారు వచ్చేవారు. 1947లో ఆమె, తన మేన మామ ఎన్. ఆర్. చందూర్ రచయిత, జగతి పత్రిక సంపాదకులు)ను వివాహం చేసుకున్నారు. మద్రాసు చేరుకుని, జార్జిటాన్‌లో అద్దె ఇంటిలో ఉంటూ, మద్రాసులో పైవేటుగా ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. 1949లో వారి రచనా వ్యాసంగం ప్రారంభించారు. అప్పట్లో రేడియోలో ఆమె రచనలను చదివి వినిపించేవారు. ఆ రోజుల్లో ఎగ్మూర్‌లో ఉన్న రేడియో స్టేషన్‌కు వెళితే ఒక సాహితీ సభకు వెళ్ళిన అనుభూతిని పొందేవారు. అక్కడే ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, జనమంచి రామకృష్ణ, పి.వి.రాజమన్నార్, ముని మాణిక్యం నరసింహారావు వంటి వారిని దగ్గరగా గమనించే అవకాశం ఆమెకు కలిగింది. 1952 నుంచి రచనా వ్యాసంగంలో తీరిక లేకుండా గడిపారు. భర్త చందూర్‌ను ఎప్పుడూ "మామయ్య"గానే సంబోధించే మాలతి అన్యోన్య దాంపత్యలో ఆనందాన్ని పొందారు. సంతానం లేని మాలతీ, చందూర్ దంపతులు రచనలే తమ సంతానంగా, సాహితీ ప్రియులే బంధువులుగా గడిపారు. మద్రాసులో తెలుగు సాహితీ సంస్థలకూ, సామాజిక ప్రముఖులకూ పెద్ద దిక్కుగా నిలిచారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన 'ఆంధ్ర మహిళా సభ' నిర్వహణలో, అభివృద్ధిలో దంపతులు ప్రధాన పాత్రలు పోషించారు. 1950లలో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో 'ప్రమదావనం' పేరిట స్త్రీల కోసం ప్రత్యేకంగా మాలతీ చందూర్‌తో కాలమ్ ప్రారంభించారు. ప్రమదావనం ద్వారా దశాబ్దాల కాలంగా పాఠకులతో ప్రశ్నలు, జవాబులు శీర్షికను విజయ వంతంగా నడుపుతూ, తెలుగు కాలమిస్టుల చరిత్రలో మాలతీ చందూర్ ఓ అరుదైన ఘనత సాధించారు. ఆ శీర్షికలో వంటలు, వార్పులే కాకుండా ఇంగ్లీషు నవలలను పరిచయం చెయ్యటం, విదేశాలలో తిరిగి వచ్చిన వారి చేత వారి అనుభవాలు రాయించటం మొదలైనవి చేశారు. ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వారు. ఎప్పుడూ వంటింటికి దూరంగానే గడిపిన మాలతీ చందూర్ రాసిన 'వంటలు – పిండి వంటలు' రచన తెలుగునాట ఎంతో ప్రసిద్ధం. వంటల పుస్తకాలు కొత్తగా పెళ్ళయిన అమ్మాయిలకు ఉపయోగకరంగా ఉండేవి. మాలతీ చందూర్ రాసే "జవాబులు" ఆడవారితో పాటు మగవారు కూడా చదివేవారు. 'జవాబులు' శీర్షిక పేజీలను వారపత్రిక నుండి చించి, పుస్తకాలుగా బైండింగులు చేసి, చాలామంది అపురూపంగా దాచుకొనేవారు. స్వాతి' మాస పత్రిక ప్రారంభ రోజుల నుండి మూడు దశాబ్దాల పైచిలుకుగా 'పాత కెరటాలు' శీర్షిక నిర్వహించారు. చంపకం – చెద పురుగులు' (1955 సెప్టెంబర్ లో ప్రథమ ముద్రణ) తో ప్రారంభించి, దాదాపు 150కి పైగా కథలు ఆమె రాశారు. మహిళా ప్రధాన నవలలు రాయటమే కాక 300 కు పైగా రచనలను తెలుగులోకి అనువదించారు. ఇవి 'పాత కెరటాలు' శీర్షికన స్వాతి మాసపత్రికలో ప్రచురించారు. నవలా రచయిత్రిగా, మహిళా కాలమిస్టుగా అనేక పురస్కారాలు అందుకొన్నది. 70వ దశకములో కేంద్ర సెన్సారు బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. అందుకోసం తమిళ తమిళ భాష నేర్చుకుని, రెండేళ్లకే అనువాదాలు ప్రారంభించి, ప్రముఖ తమిళ రచయితలు శివశంకరి, జయకాంతన్, ఎన్.ఎ.పార్థసారథి, పుళమై పిత్తన్, సుజాత, కలైంజర్ కరుణానిధి తదితరులు చేసిన తమిళ రచనలను ఆమె తెలుగులోకి అనువదించారు. భారత స్వాతంత్ర్య సమర కాలంలో జరిగిన ప్రసిద్ధ చీరాల – పేరాల ఉద్యమ నేపథ్యంతో 'వనిత' మాసపత్రికలో ఆమె రాసిన 'హృదయ నేత్రి' నవలకు 1990వ దశకం తొలి రోజుల్లో కలకత్తాలోని 'భారతీయ భాషా పరిషత్' వారి ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు వరించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను పొందారు. 2013 ఆగస్టు 21 న చెన్నైలో మాలతీ కన్ను మూసారు. మృతి చెందదానికి ముందు క్యాన్సర్ వ్యాధి గ్రస్తులయ్యారు. మెడికల్ కాలేజీకి ఆమె శరీర దానం చేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

## నామమాత్రాలైన వయోవృద్ధుల

# సంక్షేమ చట్టాలు

### నేడు నేషనల్ సీనియర్ సిటిజన్స్ డే



**కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయోవృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారత దేశంలో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టు కుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది.**

దేశంలో నెలకొన్న పరిస్థితుల వల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదేక్రమములో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు పరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడు తుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొదించబడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్ముకు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోక పోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.




### "సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"

జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ సమర్ధ వంతంగా నిర్వహించ బడుతున్నది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వరదాయిని వరలక్ష్మీ దేవి

**"నమస్తేస్తు మహామాయే, శ్రీపీఠే సుర పూజితే; శంఖ చక్ర గదా హస్తే, మహాలక్ష్మీ క నమోస్తుతే". శంఖ చక్ర గద ధారణియైన మహా లక్ష్మీ దేవి సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి లాంటి అష్టైశ్వర్య ప్రదాయిని. అష్టసంపదలు ఒసంగే జగన్మంగళ దాయిని. అష్టైశ్వర్యాలు కలుగజేసే రూపం వరలక్ష్మిగా ఆరాధనీయం. కొలిచిన వారికి కొంగు బంగారమై వరాలనిచ్చే జగజ్జనని వరలక్ష్మి.**



అన్ని లక్ష్మీ పూజల కన్నా, వరలక్ష్మీ పూజ ఉన్నతమైనదని శాస్త్ర వచనం. వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భార్య. వైకుంఠ నాథుని జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రంతో కూడిన పౌర్ణమి కల శ్రావణ మాసంలో వరలక్ష్మిని ఆరాధిస్తే, విశేష ఫలమని భావన. ఆయురారోగ్య ఐశ్వర్య సంతోషాదులు లక్ష్మీదేవిని అత్యంత ప్రియమైన శుక్రవారం పూజిస్తేనే కలుగుతాయని శ్రీ సూక్తం వివరిస్తున్నది. వరలక్ష్మిని షోడ శోపచార పూజలతో సేవిస్తే, అష్ట ఐశ్వర్యాలు, అయిదవతనం, సత్సంతానం, సంతానాభివృద్ధి కలకాలం ఉండగలవని శాస్త్ర వచనాలు. సకల కోరికెలు ఈడేరాలని, సర్వమంగళ సంప్రాప్తి కలగాలని, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని ఈ వ్రతాన్ని వివాహితులు వ్రతాన్ని ఆచరిస్తారు. వరాలు యిచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారు. ఈ పూజలు ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారు. ఈ పండగను ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారు. శ్రావణ శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు అరు దెంచే శుక్రవారం సువాసినులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం హిందూ సంప్రదాయం మంచి భర్త, సత్సంతానం కలుగాలని అమ్మాయిలు పూజిస్తారు. ఈ రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచు కుంటారు. దేవతను పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు... సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. కైలాస నాథుడు, పార్వతీదేవికి వరలక్ష్మీ వ్రతాచరణ గురించి వివరించినట్లు స్కంద పురాణంలో ఉంది. లోకంలో స్త్రీలు సక లైశ్వర్యాలు, పుత్రపౌత్రాదులను కలిగేందుకు ఏదైనా వ్రతం గురించి తెలపాలని పార్వతీ దేవి, పరమ శివుని కోరగా, వరలక్ష్మీ వ్రతాన్ని అభయంకరుడుడైన శంకరుడు వివరించారు. ఈ సందర్భంలోనే భర్తపట్ల ఆదరాన్ని అత్తమామల పట్ల గౌరవాన్ని ప్రదర్శించిన మగధ రాజ్య అంతర్గత కుండిన నగర వాసియైన పరమ సాధ్వి చారుమతి ఉత్తమ ఇల్లాలిగా ప్రవర్తించిన నేపథ్యాన్ని వివరించారు. మహాలక్ష్మిని చారుమతి చిత్తశుద్ధితో పూజించిన క్రమంలో వర లక్ష్మి ఆమెకు స్వప్న సాక్షార్కారమై, శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం తనను ఆరాధిస్తే, కోరిన వరాల్ని ఒసంగెదనని వరమిచ్చినట్లు కథనం. ముందుగా గణపతిని పూజించి కలశం లోనికి అమ్మవారిని ఆవాహన గురించి షోడశోపచార పూజ, అథాంగ పూజ చేయాలి.

### "సర్వమాంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే

శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే"!! అంటూ పూజ చేయాలి. అష్టోత్తర శత నామాల యుక్త దూప, దీప, నివేదన, తాంబూలాలను సమర్పించి, కర్పూర నీరాజనం, మంత్రపుష్పం, మంగళ హారతి సమర్పణ గావించి, తొమ్మిది దారపు పోగులతో తొమ్మిది ముడులను వేసి, మధ్యన పంచ పుష్పాలు కట్టి తోర గ్రంధి చేసి తోర గ్రంధి పూజ, తోర గ్రంధి మంత్ర పఠనం చేయాలి. "లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం, శ్రీరంగ ధామేశ్వరీం, దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం, శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ, బ్రహేంద్ర గంగాధరాం, త్వాం త్రిలోక్య కుటుంబినీం సరసిజాం, వందే ముకుంద ప్రియాం" అని స్తుతించాలి. నవ సూత్ర ధారణను కుడి చేతికి చేయాలి. ఫలభక్ష్య పానీయ పాయసాదులను అమ్మవారికి సమర్పించి, చివరగా వాయన దాన మంత్రంతో ముత్తయిదువను మహాలక్ష్మిగా భావించి, తాంబూలం అందించాలి. భక్తితో వేడుకొంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. వరలక్ష్మీ వ్రతం చేసినను, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు కలిగుతాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు వివరించినట్లు పురాణ కథనం. ఈ వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాచరణ వల్ల లక్ష్మీదేవి కృప కలిగి సకల శుభాలు కలుగుతాయి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# శ్రీలంకకు ట్రిపుల్ షాక్..

- రెండో టెస్టులో కూడా టీమిండియాదే విజయం!



గాలె వేదికగా భారత్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక 165 పరుగుల తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఇక కొలంబో వేదికగా రెండో టెస్ట్ ఆగస్ట్ 23 నుంచి ఆరంభం కానుంది. సొంత గడ్డపై మొదటి టెస్టులో ఇప్పటికే కంగుతిన్న శ్రీలంకకు.. రెండో టెస్టుకు ముందు డబుల్ షాక్ తగిలింది. స్టార్ ఆటగాళ్లు దినేష్ చండిమాల్, కుశాల్ మెండిస్ అందుబాటులో లేకుండా పోయారు. ఈ విషయాన్ని శ్రీలంక హెడ్ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ వెల్లడించాడు. పాథుమ్ నిస్సాంక కూడా తదుపరి టెస్టుకు దూరం కానున్నట్లు తెలిపాడు. దీంతో భారత్‌తో రెండో టెస్టుకు సిద్ధమవుతున్న శ్రీలంకకు భారీ షాక్ తగిలింది.
కుశాల్ మెండిస్‌కు హ్యామ్‌స్ట్రింగ్ గాయం తీవ్రంగా ఉందని గ్యారీ కిర్‌స్టెన్ తెలిపాడు. అతడు కొన్ని రోజుల పాటు జట్టుకు అందుబాటులో ఉండే ఉండడని చెప్పాడు. తొడకండరాల గాయంతో ఓపెనర్ పాథుమ్ నిస్సాంక రెండో టెస్టులో ఆడడం లేదు. తొలి టెస్టులో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో దినేష్ చండిమాల్ గాయపడ్డాడు. అతడి తల, మెడకు గాయమైంది. మైదానంలోనే అస్వస్థతకు గురికావడంతో.. వెంటనే ఆస్పత్రికి తరలించారు. చండిమాల్ స్థానంలో పాసిందూ సూర్యబండార కన్కషన్ సబ్‌స్టిట్యూట్‌గా ఆడాడు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండడంతో.. వైద్యుల సలహా మేరకు చండిమాల్‌ను రెండో టెస్టు నుంచి తప్పించారు.
దినేష్ చండిమాల్, పాథుమ్ నిస్సాంక, కుశాల్ మెండిస్‌లు దూరం కావడం యువ క్రికెటర్లకు మంచి అవకాశంగా మారుతుందని గ్యారీ కిర్‌స్టెన్ అభిప్రాయపడ్డాడు. 'దేశవాలీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మంచి రికార్డులు ఉన్న ఆటగాళ్లకు జాతీయ జట్టులో తమ సత్తా నిరూపించుకునే అవకాశం లభిస్తుంది. తొలి టెస్టులో భారత్ చేతిలో ఓడిపోయినప్పటికీ.. శ్రీలంక ఆటగాళ్లు టెస్టు క్రికెట్‌లో చూపిన పోరాట పటిమను చూపించడం సంతోషంగా ఉంది. శ్రీలంక క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారు. అయితే టెస్టు క్రికెట్‌లో జట్టు ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. టెస్టు క్రికెట్‌ను ఎక్కువగా ఆడకపోవడం వల్ల ఈ ఫార్మాట్‌లో ఎలా ఆడాలో అర్థం చేసుకోవడం కొంత కష్టంగా ఉంటుంది. రాబోయే రోజుల్లో జట్టులో మరింత మెరుగైన ప్రదర్శన తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాము' అని కిర్‌స్టెన్ తెలిపాడు.
'గాలె టెస్టులో ఒక దశలో శ్రీలంక 99 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. అయినప్పటికీ కోలుకుని మ్యాచ్‌ను ఐదో రోజు మధ్యాహ్నం వరకు తీసుకెళ్లడం సానుకూల అంశం. చివరి రోజు ఉదయం కూడా మ్యాచ్‌లో ఏదైనా అద్భుతం చేయగలమనే నమ్మకం మాకు కలిగింది. కనీసం మ్యాచ్‌ను డ్రా చేసుకునే అవకాశం ఉందని భావించాము. జట్టు ఆటగాళ్లలో కనిపించిన ఉత్సాహం, పోరాట తత్వం నాకు నచ్చింది. టాప్ ఆర్డర్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ మా బ్యాటర్లు విఫలమవడం ఓటమికి ప్రధాన కారణం. యువ బ్యాటర్ సోనల్ దినూష బాగా ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 84 పరుగులు చేసి శ్రీలంక తరపున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. టెస్టు క్రికెట్‌పై దినూషకు ఉన్న ఆసక్తి, సుదీర్ఘంగా బ్యాటింగ్ చేయాలనే అతడి విధానం నన్ను ఆకట్టుకున్నాయి. టెస్టుల్లో ఎక్కువసేపు క్రీజులో నిలవడం, పరుగులు సాధించడం, మ్యాచ్‌పై ప్రభావం చూపించడం వంటి అంశాలను యువ ఆటగాళ్లు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం దక్కింది' అని కిర్‌స్టెన్ తెలిపాడు. గాయాలతో సతమతం అవుతున్న శ్రీలంకపై విజయం సాధించడం టీమిండియాకు ఈజీనే అని చెప్పాలి.

# హార్దిక్ పాండ్యా ట్రేడ్ రూమర్స్..

- ముంబై ఇండియన్స్ పోస్ట్ వైరల్..
- హింట్ ఇచ్చేసిందా?



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడ్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. హార్దిక్‌ను ముంబై ఇండియన్స్ మరో ఫ్రాంచైజీకి ట్రేడ్ చేయనుందంటూ ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు అతడిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయని.. మరోవైపు గుజరాత్ టైటాన్స్ టీంలోకి వెళ్లేందుకు హార్దిక్ సముఖంగా ఉన్నాడంటూ న్యూస్ వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ముంబై ఫ్రాంచైజీ తన సోషల్ మీడియాలో హార్దిక్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను పోస్ట్ చేయడం ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచింది.
హార్దిక్ పాండ్యా 2015లో ముంబై ఇండియన్స్ తరపున ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ముంబై జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగిన హార్దిక్.. 2022 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ జట్టులోకి వెళ్లాడు. తొలి సీజన్‌లోనే టైటాన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించి.. జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు. ఆ తర్వాత సీజన్‌లో కూడా గుజరాత్‌ను ఫైనల్ వరకు చేర్చాడు. 2024లో హార్దిక్‌ను ముంబై ట్రేడింగ్ విండో ద్వారా తిరిగి జట్టులోకి తీసుకుంది. ముంబైకి తిరిగి వచ్చిన హార్దిక్‌కు జట్టు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. అయితే అతడి నాయకత్వంలో 2024 జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి సీజన్‌లో ప్లేఆఫ్స్‌లో క్వాలిఫయర్2 వరకు చేరుకున్నప్పటికీ.. 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది.
ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేసే అవకాశాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఐపీఎల్ ట్రేడింగ్ విండోకు సంబంధించిన చర్చలు జరుగుతున్న సమయంలో ముంబై ఇండియన్స్ హార్దిక్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈ పోస్టు ద్వారా హార్దిక్ ట్రేడ్‌పై వస్తున్న వార్తలకు చెక్ పెట్టినట్లే కనిపిస్తోంది. 'హార్దిక్ ఎక్కడికి వెళ్లడం లేదు, ముంబైలోనే ఉంటాడు' అని ఎంఐ చెప్పకనే చెప్పింది. ముంబై పోస్ట్‌పై అభిమానులు కూడా స్పందిస్తున్నారు. ముంబైలోనే హార్దిక్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే హార్దిక్ ట్రేడ్‌కు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియా పోస్టుతో అభిమానుల్లో కొత్త చర్చ మొదలైనప్పటికీ.. హార్దిక్ ముంబైలోనే కొనసాగుతాడా? లేదా అన్నది అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



# నాకు సిగ్గు, అహంకారం ఉండవు..

- కేఎల్ రాహుల్ సంచలన వ్యాఖ్యలు!

శ్రీలంకతో గాలె వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియా 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 372 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకను భారత బౌలర్లు 206 పరుగులకే ఆలౌట్ చేశారు. యువ స్పిన్నర్ మానవ్ సుతార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ తమ వంతు సహకారం అందించారు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన రాహుల్.. టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న సానుకూల వాతావరణం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా ఒకరినొకరు నేర్చుకునేందుకు భారత ఆటగాళ్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని లోకేష్ రాహుల్ చెప్పాడు. జట్టులో ప్రతి ఒక్కరూ మరో ఆటగాడికి సహాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నాడు 'మీరు సీనియర్ అయినా, 26 ఏళ్ల వయసులో 20 టెస్టులు ఆడిన ఆటగాడైనా.. మీ సహచరుడికి సహాయం చేయడం బాధ్యత. గతంలో 6070 టెస్టులు ఆడిన ఆటగాళ్లు జట్టులో ఉన్నప్పుడు నేను 20 లేదా 30 టెస్టులే ఆడి ఉండేవాడిని. అయినప్పటికీ వారి నుంచి నేర్చుకోకూడదనే సిగ్గు లేదా అహంకారం ఎవరికీ ఉండేది కాదు. అలాగే ఎక్కువ టెస్టులు ఆడిన ఆటగాడిని సంప్రదించకూడదనే భావన కూడా లేదు. మా డ్రెస్సింగ్ రూమ్ ఎప్పుడూ అందరూ స్వేచ్ఛగా మాట్లాడుకునే వాతావరణంగానే ఉంది' అని రాహుల్ చెప్పాడు.
వయసు, అనుభవం ఆధారంగా నేర్చుకోవడాన్ని పరిమితం చేసుకోకూడదని కేఎల్ రాహుల్ అభిప్రాయపడ్డాడు. కొత్తగా జట్టులోకి వచ్చిన ఆటగాళ్ల నుంచి కూడా తాను విషయాలు నేర్చుకుంటానని తెలిపాడు. 'నేను కొత్త ఆటగాడి నుంచి కూడా ఒకటి రెండు విషయాలు నేర్చుకుంటా. ఇప్పుడు యశస్వి జైస్వాల్‌తో స్వీప్, రివర్స్ స్వీప్ షాట్ల గురించి మాట్లాడుతుంటాను. అతడి ఆలోచనలను తెలుసుకుంటాను. అతడి ఆలోచనా విధానం నాకంటే భిన్నంగా ఉంటుంది. అలాగే నా ఆలోచనలు మరొకరికి భిన్నంగా ఉండొచ్చు. ఒకరి నుంచి మరొకరు నేర్చుకోవడం భారత జట్టులో ఎప్పటి నుంచో కొనసాగుతోంది' అని రాహుల్ వివరించాడు. శ్రీలంకపై తొలి టెస్టులో అద్భుత ప్రదర్శన చేసిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్‌పై కేఎల్ రాహుల్ ప్రశంసలు కురిపించాడు. సుతార్ నిలకడగా బంతులు వేస్తూ, చిన్నచిన్న మార్పులతో బ్యాటర్లపై ఒత్తిడి పెంచుతున్నాడని చెప్పాడు. అతడి బౌలింగ్‌లో స్థిరత్వమే ప్రధాన బలమని పేర్కొన్నాడు. 'సుతార్ రోజంతా ఒకే ప్రాంతంలో నిలకడగా బౌలింగ్ చేయగలడు. చిన్నచిన్న మార్పులతో బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు. బంతి పెద్దగా కదలకపోయినా.. ఏదో ఒకటి చేయాలనే ఆలోచన బ్యాటర్‌లో మొదలవుతుంది. అలాంటి మానసిక స్థితిలోకి బ్యాటర్‌ను తీసుకెళ్లగలిగితే బౌలర్‌దే పైచేయి అవుతుంది' అని రాహుల్ పేర్కొన్నాడు.

# రోహిత్, కోహ్లీతో పాటు వైభవ్ సూర్యవంశీకి చోటు..



2027 వన్డే ప్రపంచకప్‌కు ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ.. టీమిండియా కూర్పుపై ఇప్పటి నుంచే తెగ చర్చలు మొదలయ్యాయి. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నీ కోసం భారత జట్టు ఎలా ఉండాలనే దానిపై మాజీ క్రికెటర్లు, అభిమానులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. తాజాగా టీమిండియా మాజీ ఓపెనర్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు రాబిన్ ఊతప్ప తన అంచనా 15 మంది సభ్యుల జట్టును ప్రకటించారు.
తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియో ద్వారా ఊతప్ప తన టీంను వెల్లడించారు. ఆయన జట్టులో రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్‌లను తొలి ఎంపిక ఓపెనర్లుగా పేర్కొన్నారు. వీరితో పాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా జట్టులో చోటు కల్పించారు. ఊతప్ప ఎంపికలో అందరి దృష్టిని ఆకర్షించిన అంశం వైభవ్ సూర్యవంశీకి చోటు కల్పించడమే. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శన చేసిన వైభవ్.. 2026 సీజన్‌లో 16 ఇన్నింగ్స్‌ల్లో 776 పరుగులు చేశాడు. అతని బ్యాటింగ్ సగటు 48.50 కాగా.. స్ట్రైక్‌రేట్ ఏకంగా 237.31గా ఉంది.
2026 జూలై 4న ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో వైభవ్ భారత సీనియర్ జట్టులో అరంగేట్రం చేశాడు. అయితే ఇప్పటివరకు వన్డేల్లో టీమిండియా తరపున ఆడలేదు. అయినప్పటికీ 2027 ప్రపంచకప్ నాటికి అతడు మరింత పరిణతి సాధించి జట్టుకు ఉపయోగపడగలడనే అంచనాతో ఊతప్ప అతడిని ఎంపిక చేశారు.
రాబిన్ ఊతప్ప తన జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరికీ చోటు కల్పించారు. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి ఈ ఇద్దరు స్టార్ క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతారా లేదా అనేది ప్రస్తుతం పెద్ద చర్చగా ఉంది. అయినప్పటికీ ఊతప్ప తన అంచనా జట్టులో ఇద్దరినీ ఎంపిక చేయడం ఆసక్తికరంగా మారింది. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు చోటు ఇచ్చారు. వికెట్ కీపింగ్, బ్యాటింగ్‌లో అదనపు ఆప్షన్ల కోసం కేఎల్ రాహుల్, సంజూ శాంసన్‌లను ఎంపిక చేశారు. ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యాను ప్రధాన పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా ఊతప్ప ఎంపిక చేశారు. స్పిన్ ఆల్‌రౌండింగ్ కోసం రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లకు చోటు ఇచ్చారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌ను ఎంపిక చేశారు. అయితే శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్‌లకు ఈ 15 మంది జట్టులో చోటు దక్కలేదు. అలాగే నితీశ్ కుమార్ రెడ్డి కూడా ఊతప్ప ఎంపికలో కనిపించలేదు.
బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్‌లకు చోటు కల్పించారు. వీరితో పాటు అనూహ్యంగా భువనేశ్వర్ కుమార్‌ను కూడా ఊతప్ప తన జట్టులోకి తీసుకున్నారు. ఇక యువ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణలకు ఊతప్ప 15 మంది జట్టులో చోటు ఇవ్వలేదు.

**రాబిన్ ఊతప్ప ఎంపిక చేసిన 15 మంది జట్టు:**
రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, వైభవ్ సూర్యవంశీ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, సంజూ శాంసన్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్.

# ప్రీ క్వార్టర్స్‌లో సింధు ఓటమి

## వరల్డ్ ఛాంపియన్‌షిప్ నుంచి ఔట్



- ముంబై ఇండియన్స్ పోస్ట్ వైరల్..
- హింట్ ఇచ్చేసిందా?

భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు వరల్డ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2026లో భారీ షాక్ తగిలింది. వరుసగా రెండు విజయాలతో ప్రీ క్వార్టర్స్‌కు దూసుకొచ్చిన ఆమెకు ఇక్కడ ఓటమి ఎదురైంది. మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్ 3 వాంగ్ జి యిని ఢీ కొట్టిన సింధు 1121, 2115, 1721 తేడాతో పోరాడి ఓడింది. దీంతో ఆరోసారి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించాలన్న సింధు ఆశలు ఆవిరయ్యాయి.

**హోరాహోరీ మ్యాచ్‌లో ఓటమి**
తొలి రెండు మ్యాచ్‌ల్లాగే ఈ గేమ్‌లోనూ సింధు ఫుల్ కాన్ఫిడెన్స్‌తో బరిలోకి దిగింది. అయితే మ్యాచ్ ఆరంభం నుంచే ఇద్దరి మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ప్రారంభంలో ఇద్దరు కూడా ఒక దశలో 77తో సమంగా నిలిచారు. అయితే, ఆ తర్వాత చైనా క్రీడాకారిణి వాంగ్ జియి దూకుడుగా ఆడింది. సింధుకు స్కోర్ చేసే అవకాశం ఇవ్వకుండా, వాంగ్ 2111 తేడాతో తొలి సెట్‌ను సులభంగా కైవసం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో సింధు తన అనుభవాన్ని ప్రదర్శిస్తూ పుంజుకుంది. ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. దీంతో ఆమె 21 15 తేడాతో రెండో సెట్‌ను గెలిచి మ్యాచ్‌ను సమం చేసింది.
దీంతో పోటీ మూడో సెట్‌కు దారితీసింది. ఇద్దరు కూడా పోటీపడి మరీ ఆడుతుండడంతో మ్యాచ్ హోరాహోరీగా సాగింది. దీంతో అభిమానుల్లోనూ ఉత్కంఠ పెరిగింది. ఈ సెట్‌లో ఒక దశలో సింధునే 73తో లీడ్‌లో నిలిచింది. ఇక 1616తో స్కోర్ సమమైన దశలో ఉత్కంఠ రేగింది. సరిగ్గా అప్పుడే వాంగ్ గాయపడింది. దీంతో నడిచేందుకు కూడా ఆమె కష్టపడింది. అయినప్పటికీ ఆటను కొనసాగించింది. చివర్లో వరుసగా నాలుగు పాయింట్లు సాధించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. అయితే మ్యాచ్‌లో గాయపడినా పట్టు వదలకుండా పోరాట పటిమ చూపించిన వాంగ్‌పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.
'మ్యాచ్‌లో ఓడిపోవడం నిరాశ కలిగిస్తుంది. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకొని మ్యాచ్‌ను విజేతగా ముగించాల్సింది. 17 పాయింట్ల వద్ద ఉన్నప్పుడు ఇద్దరికీ సమాన అవకాశాలు ఉంటాయి. ఇలాంటి మ్యాచ్‌ల్లో ప్రతీ పాయింట్ కూడా ముఖ్యమే. అందుకే నేను ఆ సమయంలో ఇంకాస్త ఒపిగ్గా ఆడాల్సింది. పొరపాట్ల నుంచి నేర్చుకొని ఇంకా బలంగా తిరిగొస్తా' అని మ్యాచ్ అనంతరం సింధు తెలిపింది.
గతంలో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సింధు ఐదు పతకాలు సాధించింది. 2013, 2014లో కాంస్యం గెలుచుకున్న సింధు 2017, 2018లో రజత పతకాలు ముద్దాడింది. ఇక 2019లో ఏకంగా స్వర్ణం సాధించింది. ఇక ఇప్పుడు సొంత అభిమానుల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో భారీ అంచనాలతో బరిలోకి దిగింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో అదరగొట్టి ప్రీ క్వార్టర్స్‌కు చేరింది. కానీ ప్రీ క్వార్టర్స్‌లో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మరోవైపు, పురుషుల సింగిల్స్‌లోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. యువ షట్లర్ ఆయుశ్ శెట్టి కూడా ప్రీ క్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టాడు. అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా)ను ఎదుర్కొన్న ఆయుశ్ 2119, 2111 తేడాతో ఓడిపోయాడు.

డబుల్స్‌లో క్వార్టర్స్‌కు
మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ గాయత్రి గోపీచంద్ జోడీ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. దీంతో ఈ జోడీ పతకానికి అడుగు దూరంలో నిలిచింది. ఈ భారత ద్వయం ప్రీ క్వార్టర్స్‌లో రిన్ ఇవానాగా నకనిషి (జపాన్)ను ఎదుర్కొంది. ఇందులో 2116, 2112తో భారత జోడీ విజయం సాధించింది. ఇక శుక్రవారం జరగనున్న క్వార్టర్ ఫైనల్‌లో గాయత్రి జోడీ, ప్రపంచ నంబర్ 4 జాంగ్ షుక్సియన్ జియా యిఫాన్ (చైనా)ను ఢీ కొట్టనుంది.

# గోల్ లేకపోయినా గెలిచిన భారత్..



- ప్రపంచకప్‌లో రెండో రౌండ్‌కు అర్హత

మహిళల హాకీ ప్రపంచకప్ 2026లో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. ఇంగ్లాండ్‌తో గురువారం జరిగిన పూల్ డీ మ్యాచ్ 00తో డ్రాగా ముగిసింది. ఈ ఒక్క పాయింట్‌తో భారత్ పూల్‌లో రెండో స్థానాన్ని దక్కించుకుని రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. అయితే, మ్యాచ్ ప్రారంభం నుంచే భారత్ గోల్ కోసం ప్రయత్నించింది. పలు అవకాశాలు లభించినప్పటికీ వాటిని గోల్స్‌గా మలచలేకపోయింది. మరోవైపు ఇంగ్లాండ్ చివరి దశలో తీవ్ర ఒత్తిడి తెచ్చినా భారత రక్షణ శ్రేణి పటిష్ఠంగా నిలిచింది. గోల్‌కీపర్ బిచు దేవి కీలక సేవ్స్‌తో జట్టును కాపాడారు. భారత్ టోర్నీలో తన ప్రయాణాన్ని చైనాతో 22 డ్రాతో ప్రారంభించింది. అనంతరం దక్షిణాఫ్రికాపై 61తో ఘన విజయం సాధించింది. ఇంగ్లాండ్‌తో డ్రాతో భారత్ పూల్ డీలో అజేయంగా నిలిచి ఐదు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనా ఏడు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇక, తదుపరి రౌండ్‌లో భారత జట్టు మరింత కఠినమైన సవాళ్లను ఎదుర్కోనుంది. స్జోర్డ్ మారిజ్నే నేతృత్వంలోని భారత జట్టు ఇదే జోరును కొనసాగించి ప్రపంచకప్ టైటిల్ రేసులో ముందుకు సాగాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఆసీస్‌కి గుడ్‌బై..

పంజాబ్ కింగ్స్ మాజీ ఆల్‌రౌండర్ మోయిసెస్ హెన్రిక్స్ ఆస్ట్రేలియాకు గుడ్‌బై చెప్పి తన సొంత దేశమైన పోర్చుగల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఫిన్‌లాండ్ వేదికగా జరుగుతున్న 'ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్ సబ్ రీజినల్ యూరోప్ క్వాలిఫైయర్ C' టోర్నీలో పోర్చ్‌గల్ తరపున అద్భుతమైన ప్రదర్శనలతో హెన్రిక్స్ దూసుకుపోతున్నాడు. అరంగేట్ర మ్యాచ్‌లో ఇజ్రాయెల్‌పై మెరుపు అర్ధ శతకంతో విరుచుకుపడ్డ హెన్రిక్స్.. తాజాగా చెక్ రిపబ్లిక్‌తో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర శతకంతో చెలరేగిపోయాడు. పోర్చుగల్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హెన్రిక్స్.. కేవలం 51 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 111 పరుగులు చేశాడు. టీ20 క్రికెట్‌లో అతడికి ఇదే తొలి సెంచరీ కావడం గమనార్హం. మోయిసెస్ విధ్వంసకర ఇన్నింగ్స్ దెబ్బకి పోర్చుగల్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం భారీ లక్ష్య చేధనలో చెక్ రిపబ్లిక్ పూర్తిగా తేలిపోయిది. 8.5 ఓవర్లలో 24 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో వర్షం రావడంతో ఆటను నిలిపివేశారు. అయితే వర్షం ఎప్పటికి తగ్గుముఖం పట్టకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం.. పోర్చుగల్‌ను విజేతగా నిరయించారు.



# పోలీస్ కంపెనీ షూటింగ్ ఆపేశారు..

## రూ.1.32 కోట్ల బకాయిలు చెల్లించిన రాంగోపాల్ వర్మ!

తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టెక్నీషియన్ల బకాయిలను ఎట్ట కేలకు దర్శకుడు రాంగోపాల్ వర్మ చెల్లించారు. తన కొత్త సినిమా 'పోలీస్ కంపెనీ' షూటింగ్‌ను సినీ కార్మికుల సంఘం అడ్డుకోవడంతో రూ.1.32 కోట్ల బకాయిలను చెల్లించినట్లు సమాచారం. పూర్తి మొత్తాన్ని అందుకున్న తర్వాతే షూటింగ్‌కు అనుమతి ఇచ్చినట్లు 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) తెలిపింది. సర్కార్, సర్కార్ 3 సహా పలు సినిమాలకు పని చేసిన టెక్నీషియన్లకు వర్మ బకాయిలు చెల్లించాల్సి ఉందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ అధ్యక్షుడు బీఎన్ తివారీ తెలిపారు. కొన్నేళ్లుగా డబ్బు చెల్లిస్తానని హామీలు ఇచ్చినా.. ఆచరణలో మాత్రం జరగలేదని ఆరోపించారు. 2019లో పూర్తి మొత్తాన్ని చెల్లిస్తానంటూ వర్మ లేఖ కూడా పంపారని చెప్పారు. తర్వాత ఆఫీసు మూసేసి అందుబాటులో లేకుండా పోయారని తివారీ ఆరోపించారు. గోవాలో కనిపించినప్పుడు బకాయిలు చెల్లిస్తానని చెప్పారని.. తర్వాత హైదరాబాద్‌కు వచ్చి చిన్న సినిమాలు చేస్తున్నారని తివారీ పేర్కొన్నారు. అయితే ఈసారి 'పోలీస్ కంపెనీ' షూటింగ్ ప్రారంభం కాకుండా అడ్డుకోవడంతో వర్మపై ఒత్తిడి పెరిగిందని అన్నారు. కొందరు ప్రముఖులు జోక్యం చేసుకున్న తర్వాత పూర్తి మొత్తాన్ని చెల్లించారని తెలిపారు. హర్షవర్ధన్ రాణే ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'పోలీస్ కంపెనీ'.. ముంబై అండర్‌వరల్డ్ నేపథ్యంలో రూపొందుతోంది. దయా నాయక్ పాత్ర ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇక వర్మ సిండికేట్, సర్కార్ 4 సినిమాలపై కూడా పనిచేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.



# అవి పుకార్లేనట..

ఇటీవల 'లెనిన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. ఈ మూవీతో కెరీర్‌లోనే భారీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఈ ఒక్క సినిమా విజయంతో అమ్మడి రేంజ్, క్రేజ్ పూర్తిగా మారిపోయాయి. దీంతో ఈ హీరోయిన్ చెంతకు వరుస సినిమా ఆఫర్లు క్యూ కడుతున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే భాగ్యశ్రీకి బాలీవుడ్‌లో ఒక బంపర్ ఆఫర్ వచ్చినట్లు గత కొద్ది రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు మిలాప్ జవేరి దర్శకత్వంలో రాబోతున్న ఒక భారీ ప్రాజెక్ట్‌లో బీటౌన్ హ్యాండ్సమ్ హీరో ఆదిత్య రాయ్ కపూర్ సరసన హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే ఎంపికైనట్లు పుకార్లు షికార్లు చేశాయి. దీంతో భాగ్యశ్రీ బాలీవుడ్‌లో కూడా తన హవా కొనసాగించాలి అంటూ ఆకాంక్షించారు ఫ్యాన్స్. కానీ, ఈ చిత్రంలో భాగ్యశ్రీ భాగం కావడం లేదని క్లారిటీ ఇచ్చింది ప్రముఖ నిర్మాణ సంస్థ టీసిరీస్. ఈ మేరకు తాజాగా వైరల్ అవుతున్న వార్తలపై స్పందిస్తూ.. 'మిలాప్ జావేరీ తదుపరి చిత్రంలో ఆదిత్య రాయ్ కపూర్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నట్లు వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఇంకా ఈ చిత్రంలో హీరోయిన్ ఎంపిక కాలేదు' అంటూ క్లారిటీ ఇచ్చారు.

# ఇరుముడితో రవితేజ హిట్టు కొట్టినట్టేనా?



మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఇరుముడి' చిత్రం మరికొన్ని గంటల్లో (ఆగస్టు 21) ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయింది. ఇందులో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా, సాయి కుమార్ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో దర్శకుడు శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఇక ఈ సినిమా రిలీజ్ సందర్భంగా రవితేజ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా.. 'ప్రతి సినిమా ఒక ప్రత్యేకమైన ప్రయాణాన్ని కలిగి ఉంటుంది.. అందులోనూ 'ఇరుముడి' నాకెంతో ప్రత్యేకమైనది. థియేటర్లలో ఈ సినిమాను మీరందరూ చూడబోతుండటం పట్ల నేను ఎంతో ఉత్సాహంగా ఉన్నాను! స్వామియే శరణం అయ్యప్ప' అంటూ సరికొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. కాగా.. రిలీజ్‌కు ముందే ఈ సినిమా లాభాల బాట పట్టినట్లు తెలుస్తోంది. ట్రేడ్ రిపోర్ట్స్ ప్రకారం.. ఇరుముడి బిజినెస్ ఫ్యాన్సీ రేట్స్‌కి జరిగినట్లు సమాచారం. చాలా రోజుల తర్వాత రవితేజ సినిమాకి రిలీజ్‌కి ముందే దాదాపు ₹10 కోట్ల వరకు ప్రాఫిట్ వచ్చిందని టాక్. ఇక సినిమా రిలీజ్ తర్వాత మరో ₹10-20 కోట్ల వరకు ప్రాఫిట్ వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సినిమాకి ప్రీ రిలీజ్ బిజినెస్ 20 కోట్లు కాగా బ్రేక్ ఈవెన్ 21 కోట్లు... సినిమా ఫస్ట్ రోజు సాలిడ్ టాక్ వస్తే రవితేజ కి బ్రేక్ ఇవెన్ మొదటి వారంలో జరిగిపోతుంది.. రిలీజ్ తరువాత ఇక బాక్సాఫీస్‌పై రవితేజ మాస్ జాతర ఎలా ఉంటుందో చూడాల్సి ఉండగా.. ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఆడియెన్స్ చాలా కఠినంగా ఉన్నారు..

అక్కినేని ఫ్యామిలీకి చెందిన హీరోలు కింగ్ నాగార్జున్, యువ హీరోలు నాగచైతన్య, అఖిల్ అక్కినేని ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ 'వెరైటీ ఇండియా' కవర్‌పై తాజాగా సందడి చేశారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూలో పాల్గొని అక్కినేని నాగార్జున తన సినీ ప్రయాణంతో పాటు తన కొడుకుల కెరీర్‌కు సంబంధించిన పలు ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. ఈ మేరకు తన కెరీర్‌లో మైలు రాయిగా నిలిచిన 'గీతాంజలి' చిత్రం గురించి మాట్లాడుతూ.. 'డైరెక్టర్ మణిరత్నంతో కలిసి 'గీతాంజలి' సినిమా చేయడం అప్పట్లో నేను తీసుకున్న సాహసోపేత నిర్ణయాల్లో ఒకటి. 'గీతాంజలి' కోసం 1990లో తీసుకున్న ఆ బోల్డ్ డెసిషన్‌నే నా కెరీర్‌కు కొత్త దిశ చూపించింది. అలాంటి విభిన్నమైన స్టోరీని ఎంచుకునేందుకు అప్పట్లో ఉన్న ఇతర స్టార్ హీరోలు ఎవరు ముందుకు రాలేదు. అయినప్పటికీ నేను ఆ ప్రాజెక్టు చేయాలని నిర్ణయించుకున్నాను. నాలాగే నాగచైతన్య, అఖిల్ కూడా అలాంటి బోల్డ్ డెసిషన్స్ తీసుకోవాలని కోరుకుంటున్నా. ఇప్పటి ఆడియెన్స్ చాలా కఠినంగా ఉన్నారు.. సినిమా నచ్చకపోతే వెంటనే పక్కనపెట్టేస్తారు. కాబట్టి వాళ్లను దృష్టిలో పెట్టుకుని కథలు ఎంచుకోవాలి' అంటూ తన అభిప్రాయాలను పంచుకున్నాడు.



# బికినీలో దివ్యభారతి..

## వైరల్‌గా మారిన ఫొటోలు

తమిళ నటి దివ్యభారతి 'బ్యాచిలర్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు కూడా ఆమె పరిచయమయ్యారు. తాజాగా దివ్యభారతి మలేషియాలో విహరిస్తూ సందడి చేస్తున్నారు. అక్కడ స్విమ్మింగ్ పూల్ వద్ద సరదాగా గడిపిన ఆమె.. బికినీలో దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. మలేషియా అందాలను ఆస్వాదిస్తున్న దివ్యభారతి.. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ సేదతీరారు. బికినీలో ఉన్న ఫొటోలను అభిమానులతో పంచుకోవడంతో అవి క్షణాల్లో వైరల్‌గా మారాయి. నటి తాజా రూపంపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.

# బిగ్‌బాస్‌లోకి బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ..



అత్యధిక ప్రేక్షకాదరణ పొందిన టెలివిజన్ రియాల్టీ షోలలో బిగ్‌బాస్ ఒకటి. ఇది వివిధ భాషల్లో కోట్లాది ప్రేక్షకులను అలరిస్తూ అత్యధిక టీఆర్పీ రేటింగ్‌తో దూసుకెళ్తుంది. ఇప్పటికే తెలుగుతో పాటు పలు భాషల్లో అగ్ని పరీక్ష టాస్క్ నడుస్తుండగా.. తాజాగా హిందీ బిగ్‌బాస్‌కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఇప్పటికే 19 సీజన్లను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న బిగ్ బాస్ హిందీ తన 20వ సీజన్‌తో తిరిగి రావడానికి సిద్ధమవుతోంది. రాబోయే ఈ షో కోసం ఏర్పాట్లు జరుగుతుండగా.. హౌస్‌లోకి వెళ్లే కంటెస్టెంట్లకు సంబంధించి ఇప్పటికే పలువురు ప్రముఖుల పేర్లు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఇప్పుడు తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ షోలో పాల్గొనాల్సిందిగా బిగ్ బాస్ 20 బృందం బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ మౌనీ రాయ్‌ను సంప్రదించింది. ఆమెను షోలోకి తీసుకురావడానికి నిర్వాహకులు భారీ పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నారని తెలుస్తుండగా.. మరి మౌనీ రాయ్ ఈ ఆఫర్‌ను అంగీకరిస్తారా, తిరస్కరిస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వైరల్ వార్తతో హిందీ బిగ్ బాస్ షోపై మౌనీ రాయ్ ఫ్యాన్స్‌లో ఉత్కంఠ నెలకొంది.



## రెడ్ డ్రెస్‌లో మెరిసిన పూజా హెగ్డే..

# ఫిదా అవుతున్న ఫ్యాన్స్

**సినిమా డెస్క్:**

టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే తన అందంతో మరోసారి అభిమానులను ఆకట్టుకున్నారు. ఇటీవల అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన ఇండియా డే పరేడ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె.. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎరుపు రంగు ఆధునిక దుస్తుల్లో మెరిశారు. ఆకర్షణీయమైన రూపంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పరేడ్ తర్వాత జరిగిన కార్యక్రమంలో పూజా హెగ్డే ర్యాంప్‌పై సందడి చేశారు. ఎరుపు రంగు దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపిస్తూ కెమెరాలకు పోజులిచ్చారు. తన క్యూట్ లుక్స్, చిరునవ్వుతో అక్కడి వారిని ఆకట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను ఆమె సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. పూజా హెగ్డే అందం, వస్త్రధారణపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'రెడ్ డ్రెస్‌లో బుట్టబొమ్మ చాలా క్యూట్‌గా ఉంది' అంటూ నెటిజన్లు వ్యాఖ్యలు చేస్తున్నారు. అభిమానులు చూపిస్తున్న ప్రేమపై పూజా కూడా స్పందించారు. 'ఈ ప్రేమకు ముగ్ధురాలినయ్యాను' అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం పూజా హెగ్డే వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న 'శ్రీ శ్రీ' చిత్రంలో ఆమె కథానాయికగా కనిపించనున్నారు. ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది.

Printed, Published and Owned by **V SAMPATH,** and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**